
మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY








సంపుటి 10 | సంచిక 203 | కర్నూలు | బుధవారం ఆగష్టు 20 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi






## వాయుగుండంగా మారిన అల్పపీడనం..

విశాఖపట్నం, ఆగస్టు 19: వాతావరణ పరిస్థితిపై వైజాగ్ తుపాను హెచ్చరిక కేంద్రం జగన్నాథ్ కుమార్ కీలక సమాచారం ఇచ్చారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిందని చెప్పారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. ఒరిస్సాలోని భవానీ పట్నానికి 90 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందన్నారు. ఈ వాయుగుండం దక్షిణ ఒరిస్సా, దక్షిణం చత్తీస్‌ఘడ్ మీదుగా ప్రయాణించి అల్ప పీడనముగా బలహీనపడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని జగన్నాథ్ తెలిపారు.వాయుగుండం ఎఫెక్ట్‌తో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని జగన్నాథ్ కుమార్ తెలిపారు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. అన్ని పోర్టులలోనూ మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందన్నారాయన. కోస్తా తీరం వెంబడి 45 నుంచి 55 కిలోమీటర్లు వేగంతో ఈదురు గాలులు వీస్తాయని.. మత్స్యకారులు వేటకు వెళ్లవొద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

**ఈ జాగ్రత్తలు తీసుకోండి..** : భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షితమైన ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. పిడుగులు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లిన వారు చెట్ల కింద తలదాచుకోవద్దని సూచించారు. సురక్షితమైన ప్రాంతాల్లో ఉండాలన్నారు. అలాగే మత్స్యకారులు సముద్రంలో వేటకి వెళ్లొద్దని హితవు చెప్పారు.

## పీ4.. సమాజానికి తిరిగి ఇవ్వాలనే 'గివ్ బ్యాక్' సిద్ధాంతం: సీఎం చంద్రబాబు



అమరావతి, ఆగస్టు19: పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. పేదరికాన్ని సమూలంగా, శాశ్వతంగా నిర్మూలించాలనే బలమైన లక్ష్యంతో పీ4 విధానానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. పీ4ను ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తొలిదశలో 15 లక్షల బంగారు కుటుంబాల ఎంపికపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. మార్గదర్శుల ఎంపికపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించారు. పీ4 సంబంధిత మార్గదర్శులతో ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రత్యేక భేటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇవాళ పీ4 పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. పీ4 చాలామంది జీవితాల్లో గొప్ప మార్పు అవుతుందని ఉద్ఘాటించారు. ఇంటర్ పాస్ అయిన అమ్మాయికి రెండు నెలల్లో ట్రైనింగ్ ఇచ్చి నెలలో ఉద్యోగం ఇచ్చి ఉపాధి కల్పించామని చెప్పుకొచ్చారు. ఆ అమ్మాయి భవిష్యత్తులో మార్గదర్శి కావాలని కోరుకుంటుందని తెలిపారు సీఎం చంద్రబాబు.పీ4పై శక్తి ఉండే ప్రతి వ్యక్తి అండగా ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. గివ్ బ్యాక్ అనేది మన సమాజ నినాదం కావాలని దిశానిర్దేశం చేశారు. సమాజం వల్ల పైకి వచ్చిన వారు తిరిగి సమాజానికి ఎంతో కొంత తిరిగి చేయాలని కోరారు. సంపద ప్రజలకు మెరుగైన జీవనం కలిగేలా ఉపయోగపడాలని సూచించారు. ఉగాది రోజు పీ4 కార్యక్రమం గురించి మొదటిసారిగా చెప్పానని.. నేడు ప్రారంభించానని గుర్తుచేశారు. 13,40,600 బంగారు కుటుంబాలను ఇప్పుడు మార్గదర్శులు దత్తతు తీసుకొంటున్నారని తెలిపారు. పీ4లో 15 లక్షలు కుటుంబాలను టార్గెట్‌గా పెట్టుకున్నామని... ఇది మానవతా ధృక్పథంతో చేసే స్వచ్ఛంద కార్యక్రమమని ఉద్ఘాటించారు. పీ4లో చేరాలని ఎవరినీ ఎలాంటి బలవంతం చేయడం లేదని... మీరు ఈ కార్యక్రమంలో పాల్గొంటే మీకు గొప్ప సంతృప్తి కలుగుతుందని చెప్పుకొచ్చారు. 250 కుటుంబాలను తానే దత్తతు తీసుకొని వారిని స్వయంగా మానిటర్ చేస్తున్నానని వివరించారు. ఇకపై ప్రభుత్వ పాలసీలు పేదలకు అనుకూలంగానే ఉంటాయని.. అదే సమయంలో సంపద సృష్టించాలని అన్నారు. ఏమాత్రం మనస్సున్నా పీ4 ఆచరణ సాధ్యమేనని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.

## సర్పంచుల, ఎంపీటీసీల, జడ్పీటీసీల సమస్యలు పరిష్కరించాలి

### సీఎం చంద్రబాబు నాయుడుకి వై.వి.బి రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్ రెడ్డిల వినతి



అమరావతి, ఆగస్టు 19 (శ్రీచక్ర): అమరావతిలోనిసెక్రటేరియట్ నందు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్‌ఛాంబర్‌రాష్ట్రఅధ్యక్షులు వై వి బి రాజేంద్రప్రసాద్ తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డిమంగళవారం కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసిన అనంతరం రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్ రెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 70 శాతం భూభాగంలో నివసిస్తున్న మూడున్నర కోట్ల గ్రామీణ ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన సర్పంచులు, ఎంపీటీసీలు మరియు జడ్పీటీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రామీణ ప్రజల, గ్రామాల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్ రెడ్డిలు తెలిపారు.

## పద్మజ పార్థీవదేహానికి నివాళులర్పించిన సీఎం చంద్రబాబు..

హైదరాబాద్, ఆగస్టు 19: నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ భౌతిక కాయానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నివాళులర్పించారు. పద్మజ మృతి వార్త తెలుసుకున్న చంద్రబాబు, లోకేష్ మంగళవారం నాడు అమరావతి నుంచి హుటాహుటిన హైదరాబాద్ వచ్చారు. జయకృష్ణ నివాసానికి చేరుకుని.. పద్మజ పార్థివ దేహానికి నివాళులర్పించారు. కాసేపు అక్కడే ఉండి.. ఆ తరువాత తిరుగుపయనం అయ్యారు. జయకృష్ణ నివాసం నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో అమరావతికి పయనమయ్యారు.ఎన్టీఆర్ పెద్ద కుమారుడు నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. పద్మజ.. దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు సొంత చెల్లెలు. పద్మజ మృతి నందమూరి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులందరూ ఫిలింనగర్‌లోని జయకృష్ణ నివాసానికి చేరుకున్నారు. సీఎం చంద్ర బాబు కూడా పద్మజ పార్థవ దేహానికి నివాళులర్పించారు.



## నెహ్రూ దేశాన్ని రెండు సార్లు విభజించారు.. ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందం వల్ల భారత్‌కు ఒరిగిందేమీ లేదని మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అంగీకరించారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. భారతదేశాన్ని నెహ్రూ రెండుసార్లు విభజించారని ఆరోపించారు. ఒకసారి రాడ్‌క్లిఫ్ లైన్‌తో విభజిస్తే, 80 శాతం జలాలు పాకిస్థాన్‌కు ఇస్తూ సింధూ జలాల ఒప్పందంతో రెండోసారి విభజించారని, ఇది రైతు వ్యతిరేక ఒప్పందమని అన్నారు. జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో మంగళవారంనాడు జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మాట్లాడారు. 'నెహ్రూ దేశాన్ని ఒకసారి, మళ్లీ మరో సారి విభజించారు. సింధూ జలాల ఒప్పందం కింద 80 శాతం జలాలు పాక్‌కు ఇచ్చారు. ఆ తర్వాత ఈఒప్పందంవల్ల భారత్‌కుఎలాంటిప్రయోజనం చేకూరలేదంటూ తన సెక్రటరీ ద్వారా పొరపాటును ఒప్పుకున్నారు' అని మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు ఇదే నిదర్శనమని చెప్పారు.కాగా, ఇదే సమావేశంలో ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపీలకు మోదీ పరిచయం చేశారు. ఓబీసీ కమ్యూనిటీ నుంచి వచ్చిన సరళ స్వభావి, నిబద్ధత కలిగిన నేత అని రాధాకృష్ణన్‌ను ప్రశంసించారు. అనంతరం రాధాకృష్ణన్‌ను ప్రధాని, ఎంపీలు సన్మానించారు

## రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి

### ప్రాజెక్టులన్నీ గ్రౌండింగ్ అయ్యేవిధంగా అధికారులు పనిచేయాలి
### పారిశ్రామికపార్కుల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
### ఏపీఐఐసీ కార్యాలయంలో జెడ్.యం, జీ.యంలతో రివ్యూ మీటింగ్ నిర్వహించిన మంత్రి టి.జి భరత్



మంగళగిరి, ఆగస్టు 19 (శ్రీచక్ర): ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తి చూపుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో జెడ్.యంలు, జీ.యంలతో మంత్రి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ కమిషనర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఎస్.ఐ.పి.బి సమావేశాల్లో ఆమోదించిన పెట్టుబడులకు చెందిన ప్రాజెక్టులపై చర్చించారు. జిల్లాల వారీగా ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిపై చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పరిశ్రమలు పెట్టేందుకు అనుమతులు ఇచ్చే విషయంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదన్నారు. ప్రతి కంపెనీ ప్రతినిధులతో నిరంతరం మాట్లాడి గ్రౌండ్ అయ్యేవిధంగా పనిచేయాలన్నారు. ఇందుకు తమ తరపున పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి జిల్లాలో తప్పనిసరిగా డి.ఐ.పి.సి సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఏమైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటికే ల్యాండ్ కేటాయించి ఇంకా మొదలుపెట్టని ప్రాజెక్టులపై ఒకటికి రెండు సార్లు మాట్లాడాలన్నారు. అప్పటికీ ప్రాజెక్టు విషయంలో కదలిక లేకపోతే ల్యాండ్ క్యాన్సిల్ చేయాలని చెప్పారు. పరిశ్రమల కోసం తీసుకున్న భూముల్లో ఇతర కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. ఏపీఐఐసీ భూములకు సంబంధించి పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించారు. కోర్టు కేసులపై కూడా మంత్రి ఆరా తీశారు. న్యాయ వివాదాలు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు

శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY
బుధవారం ఆగస్టు 20 2025

# సంపాదకీయం

## దేశగతిని మార్చనున్న ఖనిజాలు

ఓవైపు బంగారం.. మరో వైపు పెట్రోలియం .. ఈ రెండు దేశగతిని మార్చేయబోతున్నాయి. భారత దేశం 80 శాతం పెట్రోలియం ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటుంది. కేవలం 20 శాతం మాత్రమే మన దేశంలో లభిస్తోంది. అలాగే బంగారం కూడా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ప్రపంచంలో బంగారం ఎక్కువగా వినియోగించే దేశాల్లో భారత్ ఒకటి. ఈ దిగుమతుల కారణంగా మన రూపాయి విలువ తగ్గుతోంది. విదేశా మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో భారత ఆర్థిక వ్యవస్థకు ఊపిరిపోసేలా భారీ బంగారు నిల్వలను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జేఎస్ఐ) గుర్తించింది. ఇది దేశ ఆర్థిక రంగంలో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో సుమారు 20 మెట్రిక్ టన్నుల బంగారు నిల్వలు ఉన్నట్లు అంచనా. ఇది బంగారం దిగుమతులపై ఆధారపడే భారత్‌కు ఊరట కలిగించే అంశం. ఒడిశా ప్రభుత్వం ఇప్పటికే మైనింగ్ పనులను ప్రారంభించి, త్వరలో వేలం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఒడిశాలోని నాలుగు జిల్లాల్లో 20 మెట్రిక్ టన్నుల బంగారు నిల్వలను గుర్తించింది. ఈ నిల్వలు దేశంలో బంగారం ఉత్పత్తిని పెంచి, విదేశీ దిగుమతులపై ఆధారపడే తీవ్రతను తగ్గించే అవకాశం ఉంది. భారత్ ఏటా భారీ మొత్తంలో బంగారాన్ని దిగుమతి చేస్తుంది. ఇది విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని పెంచుతుంది. అధికారిక గణాంకాలు ఇంకా అందుబాటులో లేవు. అయితే, ప్రాథమిక అంచనాల ప్రకారం బంగారు నిల్వలు 10 నుండి 20 మెట్రిక్ టన్నుల వరకు ఉండవచ్చని సూచిస్తున్నాయి. భారతదేశం మొత్తం బంగారు దిగుమతులతో పోలిస్తే ఇది చిన్నదే అయినప్పటికీ, దేశీయ బంగారు ఉత్పత్తిని పెంచే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఒడిశా ప్రభుత్వం, ఒడిశా మైనింగ్ కార్పొరేషన్, ఊఎ ఈ ఆవిష్కరణను వాణిజ్యీకరించడానికి వేగంగా పనిచేస్తున్నాయి. దేవ్‌ఘర్ జిల్లాలోని మొదటి బంగారు మైనింగ్ బ్లాక్ వేలానికి సిద్ధమవుతోంది. నిక్షేపం నాణ్యత, దాని మైనింగ్ సామర్థ్యాన్ని నిర్ధారించడానికి ఉ 3 నుండి ఉ2 స్థాయిల వరకు వివరణాత్మక డ్రిల్లింగ్, నమూనా సేకరణ జరుగుతోంది. ఈ బంగారు నిక్షేపాన్ని వాణిజ్యపరంగా తవ్వితే, స్థానిక ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, ఉపాధి, సేవల విస్తరణకు వీలు కల్పిస్తుంది. భారతదేశం బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. ఒడిశాను ఇనుప ఖనిజం, బాక్సైట్‌లకు మాత్రమే కాకుండా బంగారు కేంద్రంగా గుర్తించవచ్చు. ఒడిశాలో ఇప్పటికే భారతదేశంలోని క్రోమైట్‌లో 96శాతం, బాక్సైట్‌లో 52శాతం ఇనుప ఖనిజ నిల్వలు 33శాతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా బంగారు గనులు కూడా ఈ లిస్ట్‌లోకి వచ్చి చేరాయి. దర్యాప్తు, ప్రయోగశాల విశ్లేషణ తుది నివేదిక అందాల్సి ఉంటుంది. ఆ తర్వాత సాంకేతిక కమిటీల ద్వారా వాణిజ్య సాధ్యాసాధ్యాల మూల్యాంకనం చేస్తారు. పారదర్శక వేలం, పెట్టుబడి ఆకర్షణ. పర్యావరణ, సామాజిక ప్రభావ అధ్యయనం చేస్తారు. మొత్తంమీద ఒడిశాలో ఈ బంగారు నిక్షేపాల ఆవిష్కరణ భారతదేశ మైనింగ్ వ్యూహంలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించగలదు. స్థానిక ప్రజలకు ఆర్థికంగా వరం కాగలదు. స్థానిక ఉత్పత్తి ద్వారా ఈ భారం తగ్గవచ్చు. మైనింగ్ కార్యకలాపాలు స్థానికులకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి, ఒడిశా ఆర్థిక వృద్ధికి దోహదపడతాయి. ఒడిశా ప్రభుత్వం ఈ బంగారు నిల్వలను సద్వినియోగం చేసుకునేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. మైనింగ్ పనులు ప్రారంభించడంతోపాటు, త్వరలో వేలం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. పారదర్శకమైన వేలం విధానం ద్వారా సమర్థవంతమైన కంపెనీలకు మైనింగ్ హక్కులు కేటాయించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చు. ఆధునిక మైనింగ్ సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. మైనింగ్ ఆదాయాన్ని ఒడిశాలో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి వినియోగించవచ్చు. భారత్ ప్రపంచంలో అతిపెద్ద బంగారం దిగుమతి దేశాల్లో ఒకటి. 2024లో భారత్ దాదాపు 800 మెట్రిక్ టన్నుల బంగారాన్ని దిగుమతి చేసినట్లు అంచనా. ఒడిశాలో 20 మెట్రిక్ టన్నుల నిల్వలు ఈ దిగుమతి భారాన్ని కొంతమేర తగ్గించవచ్చు. స్థానిక ఉత్పత్తి ద్వారా విదేశీ మారక ఖర్చు తగ్గడం వల్ల రూపాయి విలువ స్థిరీకరణకు దోహదం చేస్తుంది. స్థానిక ఉత్పత్తి పెరిగితే, దేశీయ మార్కెట్లో బంగారం ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. భవిష్యత్తులో అధిక ఉత్పత్తి సాధ్యమైతే, భారత్ బంగారం ఎగుమతి దేశంగా మారే అవకాశం ఉంది.

## ధర్మము వల్లనే సకల సౌఖ్యాలు సాధ్యం

**డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే.ఒంటెడుదిన్నెలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు**





గోనెగండ్ల, ఆగస్టు 19 (శ్రీచక్ర): ధర్మము వలన అర్థముతో పాటు సకల సౌఖ్యాలు కలుగుతాయని, ధర్మము వలననే ఈ సమస్త ప్రపంచం ఆధారపడి ఉన్నదని, అటువంటి ధర్మాచరణ ప్రతి వ్యక్తి కర్తవ్యమని, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మా ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గోనెగండ్ల మండలం, ఒంటెడుదిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం సి తులశమ్మ, డమాం జగదీశ్ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేశవరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు కె. ఉపేంద్ర రెడ్డి, భజన మండలి అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి సంజీవరెడ్డి, ఈశ్వర్, జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్ నాగేశ్వరప్ప,, గ్రామ పెద్దలు జి లక్ష్మీ కాంత్ రెడ్డి, జివి రాంరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కె చంద్రశేఖర్ రెడ్డి, వీరప్పతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## యూరియా కొరకు రైతన్న అవస్థలు



పెద్దకడబూరు, ఆగస్టు 19,( శ్రీ చక్ర) : మండల పరిధిలోని చిన్నకడబూరు, రంగాపురం,కంబలదిన్నె, జాలవాడి,పెద్దకడబూరు తదితర గ్రామాల రైతులు యూరియా కొరకు రైతన్నలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్ద కడుబూరు ఆర్ బి కే కేంద్రం ముందు రైతన్నలు యూరియా కొరకు ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి ఆర్ బి కే కేంద్రం ముందు యూరియా కొరకు ఆధార్ కార్డ్,పట్టాదారు పాసు పుస్తకాలు పట్టుకొని మధ్యాహ్నం వరకు కాళ్లు అరిగేలా వరుసలో నిలిచిన యూరియా మాత్రం దొరకడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్.బి.కె కేంద్రం నందు అరకొరగా ఉన్న యూరియా బస్తాలను కూడా స్థానిక, మండలంలోని ఆయా గ్రామాల రైతులకు ఇవ్వకుండా ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామ రైతులకు యూరియా బస్తాలను వ్యవసాయ అధికారులు అందజేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆర్ బి కే కేంద్రం నందు రైతులకు యూరియా కొరతను తీర్చి,అవసరమయ్యే యూరియా బస్తాలను వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంచాలని రైతన్నలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని గ్రామాల రైతులందరూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పట్టణంలోని వినాయక మండలి కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం







ఎమ్మిగనూరు, ఆగస్టు, 19( శ్రీ చక్ర):-ఎమ్మిగనూరు పట్టణంలోని గణేశ్ ఉత్సవ కమటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో అధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మిగనూరులో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ఘాట్ ను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సందర్శించారు. ఘాట్ వద్ద లైటింగ్స్, క్రేన్లు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. వినాయక చవితి ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వేడుకల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమతులపై వినాయకుని కమిటీ సభ్యులతో చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ ఘర్షణలకు తావివ్వకుండా అధికారులు పటిష్టంగా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. శాంతియూతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని గణశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. గణేశ్ చతుర్థి వేడుకల్లో జిల్లాలోనే ఎమ్మిగనూరు మొదటిస్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, కార్యక్రమంలో పోలీసులు, అగ్నిమాపకదళ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

అద్దంకి ఆగస్టు 19 పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తాండవకృష్ణ సందర్భంగా 8వేలు విలువైన క్రీడా సామగ్రిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మాయపాలెంకు బహూకరించారు ట్రస్టు ప్రతినిధులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శ్రీమతి శైలజ క్రీడా సామగ్రిని పి.డి. మధుకు అందజేశారు ప్రధానో పాధ్యాయుడు గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధిలో క్రీడలు అంతర్భాగం. క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక చురుకుదనాన్ని పెంపొందిస్తాయి. పాఠశాల స్థాయిలోనే తగిన సదుపాయాలు లభిస్తే, విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదగగలరు" అని అన్నారు. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత తరానికి పుస్తకాభ్యాసం మాత్రమే కాకుండా క్రీడల్లోనూ సమాన ప్రాధాన్యత అవసరం. క్రమశిక్షణ, సమయపాలన సమన్వయం, ఆరోగ్యకరమైన పోటీ భావన వంటి విలువలను క్రీడలు విద్యార్థుల్లో పెంపొందిస్తాయి. అందువల్ల పాఠశాలల్లో క్రీడా సామగ్రి సమృద్ధిగా ఉండటం అత్యవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి మండల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## మంజేరు సొసైటీలో అవకతవకలు

**-రికార్డులు తనిఖీ చేసిన ఎంజిఎం**
**ఎరువులు అమ్మకాల్లో అవకతవకలు**
**క్లాస్4 ఉద్యోగిని బాధ్యుని చేస్తూ సొమ్ములు రికవరీ అన్యాయంగా కట్టించారు**
**బాధితుడు సత్యమూర్తి బాధితుడు సత్యమూర్తి ఫిర్యాదు మేరకు తనిఖీ**





కాజులూరు, ఆగస్టు 19( శ్రీచక్ర)మంజేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో జరిగిన అవకతవకలుపై కాకినాడ జిల్లా డిసిసిబి ఏజిఎం శ్రావణి సొసైటీలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె కాజులూరు మండలం మంజేరు గ్రామంలో సొసైటీ నందు సొసైటీలో జరిగిన, జరుగుతున్న పరిణామాలపై ఆరా తీసి రికార్డులను తనిఖీ చేశారు. వివరాల్లోకి వెళితే ఇక్కడ సొసైటీలో 2024-2025 సంవత్సరాని సంబంధించి రైతులకు అందించిన ఎరువుల అమ్మకాల్లో అవకతవకలు జరిగాయని సోసైటిలో క్లస్4 ఉద్యోగిగా పనిచేస్తున్న చిన్నారి సత్యమూర్తి ని బాధ్యుడిని చేస్తూ రూ.13.70 లక్షల నగదును సొసైటీ సీఈవో రాజేష్ కట్టించారని చిన్నారి సత్యమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం సొసైటి రికార్డులు తనిఖీ చేశారు. అయితే ఈ విషయంలో ఇప్పటికే గత వారం రోజుల క్రితం తాళ్లరేవు డిసిసిబి బ్రాంచ్ కి చెందిన మేనేజర్ కాశీ విశ్వనాథం, సూపర్వైజర్ రామకృష్ణ లు విచారణ జరిపారు. ప్రస్తుతం జిల్లా డిసిసిబి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏజీఎం శ్రావణి రికార్డులు తనిఖీ చేసి బాధితుడు సత్యమూర్తి నుండి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో విచారణ ఇంకా పూర్తిగా లేదని ఏజిఎం శ్రావణి సందర్భంగా తెలిపారు. ఈతనికిలో తాళ్ళరేవు డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ కాశీ విశ్వనాథం, సూపర్వైజర్ రామకృష్ణాలు పాల్గొన్నారు. బెదిరించి అన్యాయంగా కట్టించారు సత్యమూర్తి. చిన్నారి సత్యమూర్తి మాట్లాడుతూ ఎరువుల అమ్మకాలలో రూ. 13.70లక్షలు తేడా వచ్చిందని చెప్పి తక్షమే ఆనగదు నీవే కట్టాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని కార్యాలయంలో బెదిరించి, భయభ్రాంతులకు గురి చేసి తననుండి సొమ్ములు కట్టించినట్లు సత్యమూర్తి పేర్కొన్నారు. రూ.3లక్షలు లోన్ మంజూరు చేసి మొత్తం రూ.13.70లక్షలు తనని బాధ్యుడుని చేస్తూ అన్యాయంగా కట్టించారని సత్యమూర్తి తెలిపారు. ఆరు నెలల వ్యవధిలో సుమారు 3లారీల లోడ్ ను తానొక్కడినే ఎలా తరలిస్తానని సత్య మూర్తి ఈసందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. తనను కావాలనే తాళ్ళరేవు సొసైటీకి పంపించి గోడౌన్ తాళం సీఈవో రాజేష్, కంప్యూటర్ ఆపరేటర్ వద్ద ఉంచుకుని ట్రాక్టర్లలో ఎరువులను తరలించారని బాధితుడు సత్యమూర్తి ఆరోపించారు. కేవలం ఆరు నెలల్లో వచ్చిన ఎరువులకి ఇక్కడ జరిగిన అవకతవకలుపై తేడా వచ్చిన సొమ్ముల్ని గమనించి దీనిపై ప్రత్యేక ఎంక్వైరీ చేయాలని సత్యమూర్తి ఈసందర్భంగా ఉన్నతాధికారులను కోరాడు. సీఈఓ రాజేష్ పై పులారోపణలు. సొసైటీలో తీసుకున్న అప్పులకు వడ్డీలు చెల్లించినప్పటికీ సంవత్సరాలు గడిచిన ఎటువంటి రసీదులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని సీఈఓపై పలువురు రైతులు ఆరోపణ చేశారు. అయితే ఇది కేవలం ఎరుగవులలోనే కాకుండా సొసైటీలో రైతులు తీసుకున్న రుణాలుపై, సొసైటీలో సొమ్ములు సైతం పక్కదారి పట్టించారని గత ఐదారు సంవత్సరాల నుండి అవకతవకలు చోటు చేసుకున్నాయని వీటిని కూడా దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో ప్రత్యేక ఎంక్వయిరీ వేయించి చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు పలువురు డిమాండ్ చేశారు. నిబంధనలకు లోబడి పనిచేశాం సీఈవో రాజేష్. తనపై సత్యమూర్తి, రైతులు చేస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదు. 2024-25 సంవత్సరంలో స్టాకు వెరిఫికేషన్ చేస్తుంటే గోడౌన్ లో ఉన్న స్టాక్, రిజిస్టర్ లో నమోదైన స్టాక్ కు రూ.13.70 లక్షలు తేడాను గమనించడం జరిగిందన్నారు. తక్కువ వస్తున్న మొత్తం నగదుని కట్టాలని చెప్పడంతో తాను మూడు దఫాలుగా చెల్లిస్తానని చెప్పి చెల్లించడం జరిగింది అన్నారు. తన తండ్రి పేరు 3లక్షలు లోన్ ఇచ్చి రికవరి చేయడం జరిగిందని తెలిపారు.

## సేవ జీవిత ఆశయంకావాలి: డాక్టర్ చప్పిడి





కాజులూరు, ఆగస్టు 19( శ్రీచక్ర)సేవను జీవిత ఆశయంగా చేసుకుంటే మంచిదని మనం సంపాదించిన దాంట్లో ఎంతో కొంత మానవ సేవకు వినియోగిస్తే జన్మ సార్థకం అవుతుందని రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పాయకరావుపేట నియోజకవర్గం పరిశీలకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు రాజ్యసభ ఎంపీ శ్రీ సానా సతీష్ బాబు జన్మదిన పురస్కరించుకొని ఎందరు పాలెం గ్రామంలో కొప్పిశెట్టి నాగబాబు ఆధ్వర్యంలో జన్మదిన శివ కేకును కట్ చేసి ఉచిత వైద్య శిబిరము ప్రారంభించడం జరిగింది ఈ శిబిరంలో సుమారు 120 మందికి రక్తపోటు మధుమేహ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇవ్వడం జరిగింది అలాగే ఇంద్ర పాలెం ఎలిమెంటరీ స్కూల్లో పిల్లలు అందరికీ పండ్లు బిస్కెట్స్ చాక్లెట్స్ పంపిణీ చేయడం జరిగింది . అదేవిధంగా ఇంద్రపాలెంలో ఉన్న అమ్మ వృద్ధుల ఆశ్రమంలో కూడా పండ్లు పంపిణీ చేయడం జరిగింది . సానా సతీష్ బాబు మరిన్ని ఉన్నత పదవులు చేయాలని పేదవారికి అండగా నిలవాలని ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి ఆకాంక్షినీచారు కొప్పి శెట్టి నాగబాబు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో సాన సతీష్ ఉంటున్నారని చెప్పారు కార్యక్రమంలో చెల్లుబోయిన ప్రకాష్ నాగరాజు శ్రీరాములు స్వామి నగర్ మాజీ ఎంపిటిసి కొండా వినాయక సాయి రాయుడు శ్రీను కాళ్ల శ్రీను తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# ఇద్దరు మహిళా దొంగల అరెస్ట్

## 4 తులాల బంగారం స్వాధీనం

## కర్నూలు 4 వ టౌన్ సీఐ విక్రమ్ సింహా



కర్నూలు, ఆగస్టు 19(శ్రీచక్ర): కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఆదేశాల మేరకు కర్నూలు నాలుగో పట్టణ సీఐ విక్రమ్ సింహా ఆధ్వర్యంలో కర్నూలు కొత్త బస్టాండ్ ఆత్మకూరు ప్లాట్ఫాం వద్ద జరిగిన బంగారు గొలుసు దొంగతనం కేసులో సోమవారం రాత్రి కర్నూలు 4 వ టౌన్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి దొంగిలించిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలు ఈ నెల 13 న మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ మండలానికి చెందిన పాగిడాల విమలమ్మ (58 సంవత్సరాలు) అనే మహిళ కర్నూలు కొత్త బస్టాండ్ నుండి ఆత్మకూరు బస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా, ఆమె చేతి బ్యాగ్లో ఉన్న చిన్న పర్స్ దొంగిలించబడింది. ఆ పర్సో సుమారు నాలుగు తులాల బంగారు గొలుసు (విలువ రూ.3,20,000/-) ఉండినది. దీనిపై న ఈ నెల 16 న పిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు. కర్నూలు నాలుగో పట్టణ సిఐ విక్రమ్ సింహా ఆధ్వర్యంలో ఎస్ ఐ మోహన్ కిశోర్ రెడ్డి, కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్, మహిళా ఏ ఎస్ ఐలు, మరియు క్రైమ్ పార్టీ సిబ్బందితో కలిసి ఈ నెల 17న రాబడిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా కర్నూలు కొత్త బస్టాండ్ వద్ద పహారా నిర్వహిస్తున్నప్పుడు ఇద్దరు మహిళలను అనుమానాస్పదంగా కదులుతూ పట్టుకున్నారు. విచారణలో షేక్ ఖాజా బీ (40 సంవత్సరాలు), షేక్ ఫరీదా (34 సంవత్సరాలు), వడ్డేగేరి కర్నూలు టౌన్ నివాసులు, అక్కాచెల్లెలు అని తేలింది. నిందితులు బంగారు గొలుసును దొంగిలించిన విషయాన్ని అంగీకరించగా, వారి వద్ద నుండి సుమారు 4 తులాల బంగారు బంగారు గొలుసు (విలువ రూ. 3,20,000/-) స్వాధీనం చేయబడింది. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపిరచినారు. సీఐ విక్రమ్ సింహా మాట్లాడుతూ ప్రజలు బహిరంగ ప్రదేశాల ముఖ్యంగా బస్టాండ్లు, రైలు స్టేషన్లలో జాగ్రత్తలు తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులను గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించవలసిందిగా కోరుతున్నాము

## పారిశుద్ధ్య సమస్యలను సమన్వయంతో పరిష్కారించండి

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్





కర్నూలు, ఆగస్టు 19(శ్రీచక్ర): నగరంలో పారిశుద్ధ్య పనులను సంబంధింత అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. మంగళవారం ఆయన 37వ వార్డు శాంతినగర్ ప్రాంతాన్ని పరిశీలించారు. రహదారులపై వర్షపు నీరు నిలవకుండా ఆక్రమణలు తొలగించి కచ్చ కాలువ నిర్మించాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కారానికి రూ.50 లక్షలతో సిసి డ్రైన్ నిర్మాణానికి సత్వరమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా నందికొట్కూరు రహదారిన విస్తరణకు సంబంధించి మార్కింగ్, బాధితులకు ఎండార్స్మెంట్ ప్రక్రియలను కమిషనర్ పరిశీలించారు. త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ క్రిష్ణలత, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ ని సమాజం నుండి పారద్రోలండి :

## ఇంచార్జి వీసీ ప్రొఫెసర్ పి.ఎస్. షా వలి ఖాన్

కర్నూలు స్పోర్ట్స్, ఆగష్టు 19 (శ్రీచక్ర) :డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుండి పారద్రోలి విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు ను కాపాడు కోవాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇంచార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.ఎస్. షా వలి ఖాన్పిలుపునిచ్చారు. మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీ లో యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రగ్స్ వద్దు బ్రో అనే పోస్టర్ ను ఇంచార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.ఎస్. షా వలి ఖాన్, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. లోకనాథ తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత డ్రగ్స్ కు బానిసలై తమ జీవిత లక్ష్యాలను సాధించకుండా తమ బంగారు భవితను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండి మంచి అలవాట్లను అలవర్చుకుంటే తమ బంగారు భవితకు బాట వేసుకున్నట్లు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మహబూబ్ బాషా, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పాల్ కృపాకర్, డాక్టర్ ఎస్.ఎస్. మొయినుద్దీన్ హుస్సేని, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా,వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలి:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా







కర్నూలు , అగస్ట్ 19 (శ్రీచక్ర): జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా,వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో నార్కోటిక్స్ కో ఆర్డినేషన్ (ఎన్కార్డ్) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖలు అన్నీ ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకుని పూర్తిస్థాయి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు..యూనివర్సిటీలు , కాలేజీలలో మత్తు పదార్థాల వినియోగంపై వర్క్ షాపులు, ర్యాలీలు తదితర అవగాహన కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు మెడికల్ కళాశాలలో కూడా విద్యార్థులకు అవగాహన కల్పించి మత్తు పదార్థాల వినియోగం జరుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డివిజన్ల వారీగా ఈ అంశంపై తీసుకుంటున్న చర్యల గురించి సబ్ కలెక్టర్ ఆదోని, పత్తికొండ, కర్నూలు ఆర్డీవోలను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ ఆదోని మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ... ఆదోని ఆర్ట్స్ కాలేజీలో అవగాహన కార్యక్రమాలు జరిపామని, కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, ఆదోని ఆర్డీవో భరత్ నాయక్ లు మాట్లాడుతూ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని, ఈ క్రాపింగ్ సమయంలో అంతర పంటలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎక్సైజ్, రవాణా శాఖలు కూడా ఈ అంశంపై దృష్టి సారించి, తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.. మత్తు పదార్థాలు సేవించేవారికి రిహాబిలిటేషన్ సెంటర్లో వైద్యం అందించి కౌన్సిలింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్ ఓ, సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం, సాగును పూర్తిగా నియంత్రించే విధంగా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు..కేసీ కెనాల్, బస్టాండ్ , రైల్వే స్టేషన్ లలో, రాత్రి సమయాల్లో పార్కులు, ఖాళీ ప్రదేశాలు, ఫ్లై ఓవర్ల లాంటి వాటిలో నిఘా ఉంచడం జరుగుతోందన్నారు.. మత్తు పదార్థాలు సేవించే వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, వారిని తిరిగి మత్తుపదార్థాల వైపు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. రైల్వే, లోకల్ పోలీస్, ఈగల్ టీమ్స్, ఎక్సైజ్ సిబ్బంది టాస్క్ ఫోర్స్ గా ఏర్పడి తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఈగల్ ఎస్పై సుజన్ కుమార్ కేసుల వివరాలను వివరించారు.అనంతరం మత్తు పదార్థాల నిర్మూలనకు సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ శాంతకుమారి, ఆర్టీసీ ఆర్ ఎం శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, మెడికల్ కాలేజ్, వైద్య శాఖ అధికారులు, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డిగ్రీ కాలేజ్, జూనియర్ కాలేజ్ ల ప్రిన్సిపల్ లు తదితరులు పాల్గొన్నారు

# రహదారుల్లో ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలి

**నేషనల్ హైవే పరిధిలో జరుగుతున్న రోడ్ల నిర్వహణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి కర్నూలు నగరంలో రోడ్లు, కాలువలు తదితర పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలి :జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**






కర్నూలు, ఆగస్టు 19 (శ్రీచక్ర): రహదారుల్లో ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లమ్మ దేవాలయం దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్హెచ్ కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు కు సంబంధించిన ప్రతిపాదనలను జనరల్ బాడీ సమావేశంలో ఆమోదం తీసుకుని ప్రభుత్వానికి పంపాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.. అలాగే ఉల్చాల, గాయత్రి ఎస్టేట్ జంక్షన్ అభివృద్ధి పనులలో పురోగతి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కర్నూలు నగరం లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే మెయిన్ రోడ్ లలో గుంతలు పూడ్చే విధంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు... కిడ్స్ వరల్డ్ నుండి కలెక్టరేట్ రోడ్ విస్తరణ పనులకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.. ప్రభుత్వ సర్వజన వైద్యశాల, బళ్ళారి చౌరస్తా, బిర్లా కాంపౌండ్, కలెక్టరేట్ సర్కిల్ ప్రాంతాల్లో తోపుడు బండ్లు, ఆటోల వల్ల ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని, రద్దీని నియంత్రించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అలాగే రోడ్లపై చెత్త ఎక్కడంటే ఎక్కడ వేయకుండా పెద్ద పెద్ద డస్ట్ బిన్ లు ఏర్పాటు చేసి, అందులో చెత్త వేసే విధంగా తగిన చర్యలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.. బళ్ళారి చౌరస్తా నుండి బి క్యాంప్ వరకు ఉన్న డివైడర్ లకు ఆకర్షణీయంగా పెయింటింగ్ లు వేయించాలని, అదే విధంగా నగరంలో పారిశుధ్య కార్యక్రమాలు పక్కా గా జరిగే విధంగా 3 షిఫ్ట్ ల ప్రకారం 3 టీమ్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. నేషనల్ హైవే, కడప పరిధిలో 16 బ్లాక్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని, ఈ పనులు నిదానంగా జరుగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నేషనల్ హైవే, కడప పీడీ నీ ఆదేశించారు..ప్రమాదాల నివారణకు వీలుగా ఆర్ అండ్ బి ద్వారా జరిగే పనులకు డీఎంఎఫ్ నుండి నిధులు మంజూరు చేశామని, ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు. కొన్ని కొన్ని చోట్ల స్పీడ్ బ్రేకర్లు అవసరానికి మించి చాలా ఎత్తుగా పెడుతున్నారని, జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నిబంధనల ప్రకారం ఎంత పెట్టాలో, అదే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు.. అదే విధంగా పంచాయతీ రాజ్ పరిధిలో ఉన్న రోడ్లు పూర్తిగా పాడై ఉన్నట్లయితే, వాటిని ఉపాధి హామీ కింద చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ ఎస్ఈ ని ఆదేశించారు.. జూలై మాసంలో జరిగిన ప్రమాదాల గురించి సమీక్షించారు.. ప్రమాదాలు జరిగిన చోట జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి, కమిటీ సూచనల మేరకు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఆలూరు నుండి కోడుమూరు రోడ్డు లో పెద్ద గుంతలు ఉన్నాయని, వాటిని పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఇన్స్టాల్ చేసిన సీసీ కెమెరాలలో కొన్ని కెమెరాలకు నిర్వహణ లేదని, నిర్వహణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు వీలుగా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు..రోడ్ సేఫ్టీ సమావేశంలో తీసుకుంటున్న చర్యల్లో భాగంగా మే, జూన్, జూలై నెలలో ప్రమాదాలు బాగానే తగ్గాయన్నారు.. ట్రాఫిక్ రూల్స్ కి సంబంధించి ప్రజలలో అవగాహన కల్పించే విధంగా ముఖ్యమైన కూడలిలో వీడియో రూపంలో ప్రదర్శించేందుకు వాహనాన్ని అందచేయాలని ఎస్పీ కలెక్టర్ ను కోరారు..సీ ఎస్ ఆర్ కింద వాహనం అందచేసే అవకాశాన్ని పరిశీలించాలని కలెక్టర్ నేషనల్ హై వే అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దన్న, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డిటిసి శాంత కుమారి, ఎన్ హెచ్ పిడి అశోక్ కుమార్, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత, ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేషన్ అధికారి సింధు సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# తుంగభద్ర నది ప్రవాహాన్ని పరిశీలించిన పీఠాధిపతులు



మంత్రాలయం , ఆగస్టు 19,(శ్రీచక్ర) : తుంగభద్ర నది ప్రవాహాన్ని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు సుబుదేంద్రతీర్థులు మంత్రాలయం సిఐ రామానుజులు , ఎస్ఐ శివాంజుల్ తో కలిసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. తుంగభద్ర డ్యాం నుంచి దిగువకు లక్ష నుంచి లక్షన్నర క్యూసెక్కుల నీరు విడుదల కావడంతో మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గంగమ్మ గుడి, పుష్కర ఘూట్లు నీట మునిగాయి. నదిలో నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు భక్తుల పుణ్య స్నానాలు నిలిపివేసి షవర్ల ద్వారా పుణ్య స్నానాలు ఆచరించే విధంగా ఏర్పాట్లు చేశారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు జారీ చేసి సీఐ రామంజులు, ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు , మఠం సిబ్బంది ఉన్నారు.



# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి





మంత్రాలయం , ఆగస్టు 19, ( శ్రీచక్ర) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంత్రాలయం గ్రామానికి చెందిన అబ్దుల్ బాష (48) మతిస్థిమితం లేక ఎక్కడ పడితే అక్కడే తిరిగేవాడని సోమవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి బయటకు వెళ్ళడం జరిగిందని అయితే రాత్రి 10.30 చిలకలడోణ ,కల్లుదేవకుంట గ్రామల మధ్య చిన్న నారాయణ పొలం దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తల వెనుక భాగంలో బలంగా దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి , కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కలెక్టరేట్ భవనం నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలి

**ప్రజా ప్రతినిధులను, రాజకీయ పక్షాలను కలుపుకోవాలి**
**పి4 పేరుతో కలెక్టరేట్ భవననిర్మాణం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతారా?**
**ప్రజామోదయోగ్యం లేకుండా వ్యవహరిస్తే ఉద్యమిస్తాం**
**అందరికీ అందుబాటులో ఉండేలా మార్కెట్ యార్డులోనే నిర్మించాలి**
**సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్**




భీమవరంఆగస్టు 19 శ్రీచక్ర కలెక్టరేట్ భవనం నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని,ప్రజాప్రతినిధులను,రాజకీయ పక్షాలను కలుపుకొని ప్రజామోదయోగ్యంతో కలెక్టరేట్ నిర్మాణం ఉండాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్ అన్నారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ప్రతాప్ తో కలసి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జె.ఎన్.వి. గోపాలన్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో నూతన కలెక్టరేట్ భవనాన్ని ఎక్కడ నిర్మిస్తారో తక్షణం జిల్లా అధికారులు జిల్లా ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో, ప్రింట్ మీడియా వేదికగా ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ముఖ్యమంత్రి గారిని కలసి పి ఫర్ పద్ధతిలో నూతన కలెక్టరేట్ భావన నిర్మాణ శంకుస్థాపనకు రావాలని కోరినట్లు ప్రచారం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రి, రాజ్యసభ ఎంపీ, శాసన మండల చైర్మన్, ప్రభుత్వ విప్ లు, రాష్ట్ర పీఏసీ చైర్మన్, 7గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఉండగా వీరి అభిప్రాయం ఏంటో కూడా నేటికీ ప్రజలకు తేలికపోవడమే కాకుండా ముఖ్యమంత్రి గారిని కలిసినవారిలో కూడా లేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పి4 పద్ధతిలో కలెక్టరేట్ భవన నిర్మాణం అంటే ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడమే అన్నారు. ఎవరి స్వలాభం కోసం పి4 పద్ధతి పెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలు కూడా నిర్మించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న విఐపీలు, వివిఐపీలు అభిప్రాయాన్ని కూడా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో అందరి ఆమోదయోగ్యంతో ప్రకటించిన భీమవరం మార్కెట్ యార్డులోనే నిర్మిస్తారా లేదా అనేది కూడా స్పష్టత చేయాలన్నారు. గతంలో నూతన కలెక్టరేట్ ప్రాంగణ స్థలాన్ని ప్రకటించి జీవో విడుదల చేసినప్పుడు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు ఆమోదించారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఎక్కడ నిర్మిస్తారు కూడా స్పష్టత ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. జిల్లా నలుమూలల నుంచి తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, ఆచంట నుంచి వచ్చే ప్రజలకు సౌలభ్యంగా సెంటర్ పాయింట్ గా మార్కెట్ యార్డు ఉందన్నారు. జిల్లా కలెక్టరేట్ భవనం శాశ్వత నిర్మాణంపై ప్రజా ప్రతినిధులందరినీ, అన్ని రాజకీయ పక్షాలను, ప్రజా సంఘాలను, ప్రజలందరినీ కలుపుకోవాలన్నారు. పి4 పేరుతో కలెక్టరేట్ భవనం నిర్మాణం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం శ్రేయస్కరం కాదన్నారు. ప్రజామోదయోగ్యం లేకుండా నిర్మిస్తే ఉద్యమిస్తామన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా మార్కెట్ యార్డులోనే నిర్మించాలని జే.ఎన్. వి. గోపాలన్ విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులు, ప్రభుత్వం కలెక్టరేట్ భవనం నిర్మాణంపై ప్రకటన తర్వాత సిపిఎం వైఖరి తెలుపుతామని చెప్పారు.

## ఈనెల 23న భీమవరంలో5 వేల ఉచిత వినాయక ప్రతిమలు పంపిణీ

**బ్రోచర్, విగ్రహ ప్రతిమలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు**





భీమవరం ఆగస్టు 19 (శ్రీ చక్ర) ప్రజలందరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే అంజిబాబు నివాసంలో ఈనెల 23వ తేదీన భగవాన్ ప్లాజా వద్ద జైత్ర బిజ్ సొల్యూషన్స్ (భీమవరం డాట్ కామ్) అధ్వర్యంలో 5 వేల ఉచిత వినాయక పత్రిమల పంపిణీ బ్రోచర్ విగ్రహ ప్రతిమను ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించారు. మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాంఅనేనినాదంతో 13 ఏళ్లుగా ఉచిత వినాయక పత్రిమలను అందించడం అభినందనీయమని అన్నారు. ఈనెల 27న జరిగే వినాయక చవితి పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. రసాయనాలతో చేసిన విగ్రహాల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగంతో పర్యావరణానికి పెను నష్టం వాటితోందన్నారు. ప్రజలు మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పూజించాలన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, యర్రంశెట్టి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీ నవధాన్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



కేవీబీపురం, ఆగస్టు 19(శ్రీచక్ర):అన్నదాతలకు అన్నీ విధాలుగా అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు.మంగళవారం కేవిబి పురం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలానికి చెందిన రైతులకు అన్నదాత సుఖీభవ తొలి విడత నగదు క్రింద రూ.5.07 కోట్లు మెగా చెక్కును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా పంపిణీ చేశారు.మండలంలో ఇంకా ఎవరైనా అర్హులైన లబ్దిదారులు ఉంటే వారు అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.అన్న దాత సుఖీభవ పథకం అమలు ద్వారా కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వంగా మారిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ నెల 15 నుండి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించడం ద్వారా మహిళలు రాష్ట్రమంతా ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలలో ఉచిత గ్యాస్ సిలిండర్లు, పెన్షన్ పెంపు, తల్లికి వందనం,అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు.అనంతరం రైతులకు సబ్సిడీ కి నవధాన్యాలు,పచ్చిరొట్ట విత్తనాలను ఎమ్మెల్యే ఆదిమూలం చేతులు మీదుగా పంపిణీ చేశారు.అంతకు ముందు వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన కూరగాయలు,సేంద్రీయ ఎరువులు ప్రదర్శనను ఎమ్మెల్యే ఆదిమూలం తిలకించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాదవ్ పర్యటన పై బిజెపి శ్రేణులకు దిశ నిర్దేశం

రామచంద్రపురం, ఆగస్టు 19 (శ్రీచక్ర)ఆగస్టు 25 వ తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరగబోయే రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ పర్యటనలో భాగంగా నిర్వహించు ర్యాలీకి సంబంధించి డా:బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జిల్లా బిజెపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ర్యాలీ సంబంధించిన పూర్తి కార్యాచరణను మరియు చేయవలసిన కార్యక్రమాలను ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ డా:బి.ఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా పెద్దలు నాయకులకు మండల అధ్యక్షులకు ఇన్చార్జిలకు ప్రధాన కార్యదర్శులకు మరియు కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండలం నుండి బిజెపి మండల అధ్యక్షులు ఆకేటి శ్రీ కృష్ణ, హసన్ బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు,జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు వాద్రేవు వెంకట రావు పాల్గొన్నారు.



# క్రీడాకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



తిరుపతి, ఆగస్టు19(శ్రీచక్ర):తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యతోపాటు క్రీడలు పట్ల ఆసక్తి కనబరిచేలా వారిని ప్రోత్సహించాలి అని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ అన్నారు.మంగళవారం స్థానిక ఎస్ వి ఆర్ట్స్ కాలేజీలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియం నందు అమరావతి చాంపియన్షిప్ జోనల్ లెవెల్ కాంపిటీషన్ ముగింపు కార్యక్రమంలో భాగంగా తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు, శాప్ బోర్డు మెంబర్ రజిని, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆగస్టు 29 స్పోర్ట్స్ డే సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కూడా జిల్లా జోనల్ రాష్ట్రస్థాయిలో వివిధ రకాల స్పోర్ట్స్ కాంపిటీషన్ లను స్పోర్ట్స్ అథారిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని అని తెలిపారు.ఈ కార్యక్రమంలో చాలా సంవత్సరాల తర్వాత జిల్లా మరియు జోనల్ స్థాయిలో నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అమరావతి ఛాంపియన్షిప్ జోనల్ లెవెల్ లో ఆర్చరీ, అతెట్లిక్స్,బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్బాల్,హాకీ, కబడ్డీ,కోకో,వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్ వంటి కాంపిటేషన్ లు ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు.అమరావతి ఛాంపియన్షిప్ జోనల్ లెవెల్ కాంపిటేషన్ కార్యక్రమమును తిరుపతి జిల్లాల్లో నిర్వహించడం జిల్లాకు గర్వకారణం అని అన్నారు. ఇంత తక్కువ సమయంలో కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీం బృందానికి కృతజ్ఞతలు అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్పోర్ట్స్ పాలసీని కూడా తీసుకువచ్చారని జాతీయ అంతర్జాతీయ ఒలంపిక్స్ స్థాయిలో ప్రతిభ కనిపించిన అందరికీ ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారుల పట్ల రాష్ట్ర ప్రభుత్వము అండగా ఉంటుంది, మంచి కోచ్ లు కూడా ఉన్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్య తో పాటు క్రీడలు పట్ల ఆసక్తి కనబరిచేలా వారిని ప్రోత్సహించాలి అని తెలిపారు. ప్రతి విద్యార్థుల్లోనూ అన్ని క్రీడల్లోనూ సాధించే సత్తా ఉందని ప్రతి ఒక్కరు కూడా బాగా కష్టపడి క్రీడల్లో రాణించి, మెడల్స్ సాధించాలని తెలిపారు.తిరుపతి శాసనసభ్యులు మాట్లాడుతూ.. అమరావతి ఛాంపియన్షిప్ జోనల్ లెవెల్ కాంపిటేషన్ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి వర్యులు క్రీడలపైన దృష్టి పెట్టారని క్రీడాకారుల భవిష్యత్తు కోసం స్పోర్ట్స్ కోటాను రెండు శాతం నుంచి మూడు శాతంకి పెంచడం జరిగిందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడలపై ఆసక్తి కలిగించేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా సాధించాలని క్రీడల వలన మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. శాప్ బోర్డు మెంబర్ మాట్లాడుతూ.. అమరావతి ఛాంపియన్షిప్ జోనల్ లెవెల్ కాంపిటీషన్ కార్యక్రమంలో ఈరోజు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ ను క్రీడాంధ్రప్రదేశ్ గా మార్చడానికి ఇలాంటి మంచి కార్యక్రమాలను చేపడుతుందని, ప్రతి ఒక్కరు కూడా క్రీడలోనే కాకుండా వారికి నచ్చిన రంగాన్ని ఎంచుకొని విజయాలు సాధించాలని తెలిపారు. అండగా ఉంటూ వారికి కావాల్సిన సౌకర్యాలతో పాటు స్పోర్ట్స్ కోటను కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాబోయే ఒలంపిక్స్ లో కూడా ప్రతి ఒక్కరు కూడా భాగస్వాములు అయి ప్రతిభను కనబరిచాలని తెలిపారు. ప్రతి ఒక్క క్రీడాకారులకు ప్రభుత్వం ఇచ్చిన అన్ని సదుపాయాలని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీ ఎస్ డి ఓ శశిధర్, అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన 'కొరియా రిపబ్లిక్' కాన్సుల్ జనరల్ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థపై ప్రశంస




శ్రీసిటీ,ఆగస్టు19(శ్రీచక్ర):చెన్నైలోని కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ చాంగ్ న్యాన్ కిమ్ మంగళవారం శ్రీసిటీని సందర్శించారు.కొరియా ట్రేడ్-ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ (కోట్రా) అధికారులు, కొరియన్ వ్యాపార ప్రతినిధుల బృందంతో కలిసి విచ్చేసిన ఆయనకు శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్మెంట్) బోడ్గన్ జార్జ్ సాదర స్వాగతం పలికారు.శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలపై సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ వారికి సమగ్ర ప్రదర్శన ఇచ్చారు. వ్యూహాత్మక స్థానం, వివిధ రంగాల పరిశ్రమలు, సామాజిక మౌలిక సదుపాయాలు, శ్రీసిటీలో పరిశ్రమల ఏర్పాటు వలన ఒనగూరే నిర్దిష్ట ప్రయోజనాలను వివరించారు. ఎల్ జి ఎలక్ట్రానిక్స్ను ఉదహరిస్తూ, శ్రీసిటీలో అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక సరఫరా గొలుసు, పర్యావరణ వ్యవస్థను హైలైట్ చేశారు. ఉత్సాహంగా చర్చల్లో పాల్గొన్న ప్రతినిధి బృందం, వివిధ ప్రశ్నల ద్వారా శ్రీసిటీలోని పలు పారిశ్రామిక జోన్లు,సామాజిక మౌళిక సదుపాయాలు,హరిత కార్యక్రమాలు తదితర అంశాల గురించి తెలుసుకున్నారు.కాన్సుల్ జనరల్ పర్యటనపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కొరియా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచేందుకు ఇది సహకరిస్తుందని వ్యాఖ్యానించారు. 31 దేశాలకు చెందిన 240+ కంపెనీలకు నిలయంగా అత్యంత విలువైన పెట్టుబడి గమ్యస్థానంగా శ్రీసిటీ మారిందన్న ఆయన, ఈ పయనంలో కొరియా కీలక పాత్రను ప్రస్తావించారు. ఆ దేశానికి చెందిన ఎల్జీ, సోలెం, హుండై ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ (హెచ్ఈపీసి),ఎస్ కే ప్యుకోర్,ఎల్ జి పాలీమర్స్ వంటి ప్రఖ్యాత సంస్థలు విజయవంతంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు.శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రశంసించిన కాన్సుల్ జనరల్, కాన్సుల్ జనరల్ గా ఇది తన మూడవ పర్యటనగా గుర్తుచేశారు.ఎల్ జి ఎలక్ట్రానిక్స్ తో సహా పలు కొరియన్ సంస్థలు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనికతను కొనియాడుతూ, రాష్ట్రంలోని రవాణా వసతులు, నైపుణ్యత, వివిధ వ్యాపార ప్రయోజనాలకు శ్రీసిటీ అద్దం పడుతుందన్నారు.పర్యటనలో భాగంగా ఎల్ జి ఎలక్ట్రానిక్స్, సోలెం పరిశ్రమ ప్రతినిధులతో కాన్సుల్ జనరల్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు.శ్రీసిటీలో కొనసాగుతున్న ఎల్ జిఎలక్ట్రానిక్స్, సోలం పరిశ్రమల నిర్మాణ పనులను పరిశీలించారు.కొరియన్ సంస్థల సీఈఓ లతో విందులో పాల్గొన్నారు.భారత్-కొరియా వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో శ్రీసిటీ కీలక పాత్రను ఈ సందర్శన రుజువు చేస్తుంది.

## ఇద్దరు మహిళకు రూ.40 వేలు ఆర్థిక సహాయం .మంత్రి సుభాష్ చేతులు మీదుగా అందజేత





కాజులూరు, ఆగస్టు 19( శ్రీచక్ర): రామచంద్రపురం నియోజకవర్గంలో కాజులూరు మండలం జగన్నాథగిరి గ్రామానికి ఒక మహిళకు, కె గంగవరం మండలం శివల గ్రామానికి చెందిన మరో మహిళకు రూ. 20 వేలు చొప్పున మొత్తం రూ. 40 వేలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే బొజ్జపు మంగ, సన్నపు నాగమణి ఆర్థిక పరిస్థితి బాలేక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. వీరిద్దరి దీనస్థితిని స్థానిక కూటమి పార్టీ నాయకులు మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి తక్షణ సాయంగా చెరో రూ.20 వేలు చొప్పున చెక్కు ను ఆర్థిక సహాయంగా అందించారు. కష్టం అని తెలిసిన వెంటనే మానవతా దృక్పథంతో సహాయం చేసిన మంత్రి సుభాష్ కు మంగ, నాగమణితో పాటు స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా 186 వ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



పాలకొల్లు:ఆగస్టు 19, పాలకొల్లు ఏరియా ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 186 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కెమేరా సృష్టి కర్త ధాగుర్రే విగ్రహానికి అసోసియేషన్ అధ్యక్షులుపి.శ్యామ్మరియు కమిటీ సభ్య లు,అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు.ఈకార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పెచ్చెట్టి శ్యామ్, సెక్రటరీ.సారధి,కోశాధికారి.రవికిషోర్, డాగుర్రే విగ్రహదాత గూడూరి బాలాజీ, కమిటీ సభ్యులు. వాసు, అంజి, యం.డి.ప్రసాద్, గంగాధర్, గిరి కుమార్, ఏడుకొండలు,రవి, యం. ప్రసాద్, మరియు సీనియర్ ఫోటో గ్రాఫర్స్, సంఘంసభ్యులుహాజరయ్యారు.

# స్పోర్ట్స్ న్యూస్

## పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలి..

### మాజీ క్రికెటర్ సంచలన వ్యాఖ్యలు..!

భారత మాజీ క్రికెటర్ కేదార్ జాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో జరగనున్న మ్యాచ్‌ను బహిష్కరించాలంటూ భారత జట్టుకు ఆయన విజ్ఞప్తి చేశాడు. "భారత జట్టు ఈ మ్యాచ్ ఆడకూడదు. ఇది జరగకూడదనేది నా అభిప్రాయం మాత్రమే కాదు. నేను నమ్ముతున్న విషయం. భారత జట్టు ఎక్కడైనా పాకిస్థాన్‌ను ఓడించగలదు. కానీ, ఈ మ్యాచ్ అసలు జరగకూడదు' అని జాదవ్ పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో అభిమానుల మధ్య చర్చలు జోరుగా సాగుతున్నాయి. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి.. ఆ తర్వాత భారత్ -పాకిస్తాన్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భారత జట్టు పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడకూడదని మాజీ ఆటగాళ్లు, అభిమానులు కలిసి బీసీసీఐకి విజ్ఞప్తి చేస్తున్నారు. కేదార్ జాదవ్‌కు ముందు మాజీ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సహా పలువురు మాజీలు ఇదే అభిప్రాయం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.ఈ ఏడాది






ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యూఏఈ వేదికగా జరుగనున్నది. బీసీసీఐ ఈ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్నది. భారత్ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న ఆడనున్నది. సెప్టెంబర్ 14న పాకిస్తాన్‌తో హైవోల్టేజ్ మ్యాచ్ జరుగుతుంది. అయితే, ఈ మ్యాచ్‌పై ఇప్పటికీ స్పష్టత లేదు. ఇండియా-పాకిస్థాన్ మధ్య రాజకీయంగా నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా, 2027 వరకు ఇరు జట్లు న్యూట్రల్ వేదికలపై మాత్రమే మ్యాచ్‌లు ఆడేందుకు ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలోనే గత మార్చిలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం వహించినప్పటికీ, భారత్ తమ మ్యాచ్‌లన్నిటిని దుబాయ్‌లోనే ఆడి, విజేతగా నిలిచింది. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీసీఐ ఏ నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.ఒక దేశంగా.. మన దేశ భద్రత, సైనికుల ప్రాణాలు, జాతీయ గౌరవానికి ప్రాముఖ్యత ఇవ్వాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయిన తరుణంలో ఆ దేశంతో సాధారణ స్థాయిలో క్రీడలు జరుగడం భావోద్వేగపూరితంగా, నైతికంగా సరికాదని పలువురు పేర్కొంటున్నారు. క్రికెట్ వంటి ఆటలు దేశాల మధ్య పాజిటివ్ రిలేషన్స్‌ని పెంచగలవు అనేది వాస్తవమే. కానీ, ఉగ్రవాదానికి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మద్దతు ఇచ్చే దేశంతో సంబంధాలు కొనసాగించడాన్ని సామాన్య ప్రజలతో పాటు మాజీ క్రికెటర్లు సైతం తీవ్రంగా వ్యతిరేకించడంలో అర్థం ఉందని క్రికెట్ పండితులు పేర్కొంటున్నారు.అయితే ఆటగాళ్లకు, ఫ్యాన్స్‌కి ఇది ఒక ప్రతిష్టాత్మక పోరు. కోట్లాది మంది టీవీలకు అతుక్కుపోయి మ్యాచ్‌ని చూస్తుంటారు. క్రికెట్‌ను పూర్తిగా రాజకీయానికి వేరుగా చూడాలన్న వాదనలు ఉన్నాయి. ఉగ్రవాద దాడుల నేపథ్యంలో ఆ దేశంతో మ్యాచులు ఆడకూడదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ప్రపంచ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లోనూ టీమిండియా మాజీ ఆటగాళ్లతో కూడిన జట్టు పాకిస్తాన్‌తో ఆడేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ దేశంతో మ్యాచ్ ఆడేది లేదని యువరాజ్ సింగ్ నేతృత్వంలోని జట్టు తేల్చిచెప్పింది.

## అందుకే శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయలేదు: అజిత్ అగార్కర్

ఆసియా కప్ 2025 బరిలోకి దిగే భారత జట్టును భారత సెలెక్షన్ కమిటీ ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మంగళవారం వెల్లడించారు. అందరూ ఊహించనట్లుగానే భారీ మార్పులు లేకుండా జట్టును ఎంపిక చేశారు. సూర్యకుమార్ యాదవ్ సారథిగా కొనసాగనుండగా.. అతనికి శుభ్‌మన్ గిల్ డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వగా.. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, రింకూ సింగ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.బ్యాకప్ వికెట్ కీపర్‌గా జితేష్ శర్మకు చోటు దక్కగా.. పేస్ ఆల్‌రౌండర్‌గా శివమ్ దూబే రీఎంట్రీ ఇచ్చాడు. అయితే టీమిండియా వెటరన్ బ్యాటర్స్ శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కలేదు. ఐపీఎల్ 2025లో మెరుగైన ప్రదర్శన చేసినా.. అతనికి అవకాశం ఇవ్వకపోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఇదే విషయాన్ని అగార్కర్‌ను ప్రశ్నించగా.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.అయ్యర్‌కు భారత టీ20 జట్టులో చోటు లేదని, అతని కోసం ఎవర్నీ తప్పించాలని ప్రశ్నించాడు. ఈ విషయంలో శ్రేయస్ అయ్యర్ తప్పిదం లేదని, మా తప్పు కూడా లేదన్నాడు. జట్టులోకి 15 మంది ఆటగాళ్లను




మాత్రమే ఎంపిక చేయగలమన్నాడు. 'శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్‌లు తప్పని పరిస్థితుల్లో జట్టులో చోటు కోల్పోవాల్సి వచ్చింది. యశస్వి జైస్వాల్ అవకాశం కోసం వేచి చూడటం దురదృష్టకరం. అభిషేక్ శర్మ ఓపెనర్‌గా అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. అంతేకాకుండా అతని వల్ల టీమిండియాకు ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ లభిస్తోంది.శ్రేయస్ అయ్యర్ పరిస్థితి కూడా దురదృష్టకరమే. శ్రేయస్ అయ్యర్ కోసం జట్టులో ఎవర్నీ తప్పించాలి? మీరే చెప్పండి? ఈ విషయంలో శ్రేయస్ అయ్యర్ తప్పిదం లేదు. అదే సమయంలో మా తప్పు కూడా లేదు. మేం కేవలం 15 మంది ఆటగాళ్లను మాత్రమే ఎంపిక చేయగలం. ప్రస్తుత పరిస్థితుల్లో శ్రేయస్ అయ్యర్ తన అవకాశం కోసం ఎదురు చూడాల్సిందే.'అని అగార్కర్ చెప్పుకొచ్చాడు.

ఆసియా కప్ కోసం భారత జట్టు

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, రింకూ సింగ్.

## అతన్ని టెస్ట్‌లకే పరిమితం చేయండి: సునీల్ గవాస్కర్

ఆసియా కప్ 2025 టోర్నీకి టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను దూరంగా ఉంచాలని హెడ్ కోచ్ గౌతం గంభీర్‌తో పాటు సెలెక్టర్ల మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సూచించాడు. బుమ్రా టెస్ట్ క్రికెట్‌కు మాత్రమే పరిమితం చేయాలన్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌కు టీమిండియా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరాడు. ఇంగ్లండ్ పర్యటనలో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. ఇది తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే బుమ్రా ఆసియాకప్ 2025 ఆడటంపై సందేహాలు నెలకొన్నాయి.సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా టీ20 ఫార్మాట్‌లో ఆసియా కప్ 2025 జరగనుంది. సెప్టెంబర్ 10న యుూఏఈతో జరిగే మ్యాచ్‌తో భారత్ తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో హైఓల్టేజ్ మ్యాచ్ ఆడనుంది. ఈ క్రమంలోనే బుమ్రాను తీసుకోవాలని కొందరంటే వద్దని మరికొందరు అంటున్నారు. తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన గవాస్కర్.. బుమ్రాను పరిమిత ఓవర్ల క్రికెట్‌కు కాకుండా సుదీర్ఘ ఫార్మాట్‌కు ఎంపిక చేయాలన్నాడు.'జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో సెలెక్టర్లు ఓ నిర్ణయానికి రావాలి. ఇటీవల ఇంగ్లండ్ పర్యటనలో అతను కేవలం మూడు మ్యాచ్‌లే ఆడాడు. ఇది పెద్ద చర్చకు దారి తీసింది. అయితే అతను తాను మూడు మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉంటానని, సెలెక్షన్ కమిటీకి ముందుగానే సూచించాడు. టీమిండియా తదుపరి టెస్ట్‌లను అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో ఆడనుంది.ఆ తర్వాత సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్ బరిలో నిలవనుంది. ఈ రెండు సిరీస్‌ల మధ్య నెల రోజుల విరామం మాత్రమే ఉంది. బుమ్రాకు ఈ విశ్రాంతి సరిపోతుంది. సెలెక్టర్లు బుమ్రాను ద్వైపాక్షిక సిరీస్‌లు పరిమితం చేయకుండా.. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ దృష్టిలో పెట్టుకొని అతని సేవలను ఉపయోగించుకోవాలి. కోచ్ గౌతం గంభీర్, బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ విషయంపై ఫోకస్ పెట్టాలి.'అని సునీల్ గవాస్కర్ పేర్కొన్నాడు.



## కెప్టెన్‌గా సూర్య, వైస్ కెప్టెన్‌గా గిల్..

### ఆసియా కప్ జట్టును ప్రకటించిన బీసీసీఐ




ముంబై : ఆసియాకప్‌లో ఆడే భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఆ టోర్నీకి శుభమన్ గిల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఇవాళ ముంబైలో సమావేశం అయిన బీసీసీఐ సెలెక్టర్ల బృందం భారత జట్టును ప్రకటించింది. మొత్తం 15 మంది ప్లేయర్ల బృందాన్ని వెల్లడించారు. అయ్యర్, జైస్వాల్‌కు చోటు దక్కలేదు.స్టాండ్ బై ప్లేయర్ల జాబితాలో కూడా శ్రేయాస్ అయ్యర్ పేరు లేదు. ఈ టోర్నీ కోసం అయిదుగురు రిజర్వ్ ప్లేయర్లను ప్రకటించారు. ప్రసిద్ధ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, జైస్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్.. రిజర్వ్ లిస్టులో ఉన్నారు. అయితే ఆ జాబితాలో కూడా శ్రేయాస్ అయ్యర్ పేరు లేకపోవడం గమనార్హం.సెప్టెంబర్ పదో తేదీన యూఏఈతో ఇండియా ఫస్ట్ మ్యాచ్ ఆడనున్నది. దుబాయ్ వేదికగానే సెప్టెంబర్ 14వ తేదీన పాకిస్థాన్‌తో హైవోల్టేజ్ మ్యాచ్ జరగనున్నది. ఇక 19వ తేదీన ఒమన్‌తో చివరి రౌండ్ మ్యాచ్ ఆడనున్నది.భారత జట్టు..సూర్యకుమార్ యాదవ్, గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, బుమ్రా, హర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్, హర్షిత్ రాణా, రింకూ సింగ్.

## దుమ్మురేపిన కాటేరమ్మ కొడుకు!



సౌతాఫ్రికాతో తొలి వన్డేలో ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ట్రావిస్ హెడ్ దుమ్మురేపాడు. అనూహ్యంగా బంతితో మెరిసిన ట్రావిస్ హెడ్ నాలుగు వికెట్లతో సఫారీ టీమ్ పతనాన్ని శాసించాడు. ఫీల్డింగ్‌లోనూ కళ్లు చెదిరే రనౌట్ చేశాడు. బ్యాటింగ్‌లోనూ దూకుడుగా ఆడుతూ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్తున్నాడు.పార్ట్‌టైమ్ బౌలర్ అయిన ట్రావిస్ హెడ్.. బంతితో మాయ చేశాడు. విధ్వంసకర బ్యాటర్ ట్రిస్టన్ స్టబ్స్(0) సిల్వర్ డక్‌గా పెవిలియన్ చేర్చిన ట్రావిస్ హెడ్.. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా తరలించిన డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్(6)ను రెండో బంతికే ఔట్ చేశాడు. కేశవ్ మహారాజ్(13)ను క్యాచ్ ఔట్ చేసిన ట్రావిస్ హెడ్..ప్రేనేలన్ సుబ్రాయెన్(1)ను రనౌట్ చేశాడు. ఈ మ్యాచ్‌లో 9 ఓవర్లు బౌలింగ్ చేసిన ట్రావిస్ హెడ్ 57 పరుగులిచ్చి 4 వికెట్లు తీసాడు. అతని ధాటికి ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 296 పరుగులే చేసింది.ఓపెనర్ ఎయిడెన్ మార్క్‌రమ్(81 బంతుల్లో 9 ఫోర్లతో 82) తృటిలో శతకం చేజార్చుకోగా.. టెంబా బవుమా(74 బంతుల్లో 5 ఫోర్లతో 65), మాథ్యూ బ్రిట్జ్‌కే(56 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 57) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆసీస్ బౌలర్లలో ట్రావిస్ హెడ్‌కు తోడుగా.. బెన్ ద్వార్షుయిస్ రెండు, ఆడమ్ జంపా ఓ వికెట్ తీసాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్.. ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో వేగంగా పరుగులు చేస్తుంది. 5 ఓవర్లలోనే ఆసీస్ 50 పరుగులు పూర్తి చేసుకుంది.

## ఏ జట్టునైనా ఓడిస్తాం.. ఈ సారి టైటిల్ మాదే..

ఆసియా కప్ 2025 టోర్నమెంట్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ మెగా టోర్నమెంట్ ప్రారంభానికి ఇంకా 20 రోజులే మిగిలి ఉన్న సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 9న అబుదాబి వేదికగా బంగ్లాదేశ్, హాంకాంగ్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఆసియా కప్ టోర్నమెంట్ ప్రారంభానికి ముందు బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ జాకర్ అలీ అనిక్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఈ ఏడాది ఆసియా కప్ టైటిల్‌ను గెలవడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్ జట్టు ఇప్పటివరకు ఆసియా కప్ టైటిల్‌ను ఒక్కసారి కూడా గెలవకపోవడం గమనార్హం. ఇంతకు ముందు 3 సార్లు(2012, 2016, 2018) ఫైనల్ చేరుకున్నప్పటికీ, ప్రతిసారీ చివరి అడుగులో ఓటమి పాలైంది.ఈ సారి ఎలాగైనా ఆసియా కప్ టైటిల్ గెలిచి తమ సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలకాలని బంగ్లాదేశ్ వ్యూహాలు రచిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే 20 మంది ఆటగాళ్లతో కూడిన ప్రిలిమినరీ జట్టును బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. అంతే కాకుండా ఆసియా కప్ టోర్నమెంట్ కోసం యూఏఈలో ఒక ప్రత్యేక శిబిరాన్ని కూడా ఏర్పాటు చేయనుంది. ఇటీవలే బంగ్లాదేశ్ కెప్టెన్ లిట్టన్ దాస్ నాయకత్వంలో శ్రీలంక, పాకిస్థాన్‌లతో జరిగిన టీ20 సిరీస్ లను గెలుచుకుని మంచి ఫామ్‌లో ఉంది.మీడియా సమావేశంలో జాకర్ అలీ మాట్లాడుతూ.."టైటిలే లక్ష్యంగా ఈసారి ఆసియా కప్‌లో బరిలోకి దిగుతున్నాం. ఈసారి ఛాంపియన్లుగా నిలుస్తామన్న నమ్మకం మా డ్రెస్సింగ్ రూమ్‌లోని ప్రతి ఒక్కరికీ ఉంది. మా జట్టులో అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నారు. ప్రతి ఒక్కరూ తీవ్రంగా శ్రమిస్తున్నారు. మేము ఏ జట్టును కూడా తేలికగా తీసుకోవడం లేదు. ఈ టోర్నమెంట్‌లో మాకు ప్రత్యేక ప్రణాళికలేవీ లేవు, కానీ ఏ జట్టుతో ఆడినా మా సహజసిద్ధమైన ఆటను కొనసాగించాలని అనుకుంటున్నాం. ఈ టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేసేందుకు అన్ని విధాలుగా సిద్ధమవుతున్నాం" అని అన్నారు.బ్యాట్స్‌మెన్: లిట్టన్ దాస్ (కెప్టెన్), తాంజిద్ హసన్ తమీమ్, ఎండి నయీమ్ షేక్, సౌమ్య సర్కార్, మహ్మద్ పర్వేజ్ హోస్సేన్ ఎమోన్, తౌహిద్ హృదయ్, జాకర్ అలీ అనిక్, షమీమ్ హుస్సేన్, నజ్ముల్ హోస్సేన్, మహిదుల్ ఇస్లాం భుయాన్ అంకోన్, మహ్మద్ సైఫ్ హసన్.




ఆల్-రౌండర్లు/బౌలర్లు: మెహిదీ హసన్ మిరాజ్, రిషాద్ హ్సేన్, షాక్ మహేదీ హసన్, తన్వీర్ ఇస్లాం, నసుమ్ అహ్మద్, హసన్ మహమూద్, తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్ సాకిబ్, సైఫుద్దీన్, నహిద్ రానా, ముస్తాఫిజుర్ రెహమాన్, షోరీఫుల్ ఇస్లాం, సయ్యద్ ఖలీద్ అహ్మద్.గ్రూప్ వివరాలు: ఆసియా కప్‌లో బంగ్లాదేశ్ జట్టు గ్రూప్-బిలో ఉంది. ఈ గ్రూప్‌లో బంగ్లాదేశ్‌తో పాటు శ్రీలంక, హాంకాంగ్, ఒమన్ జట్లు ఉన్నాయి.


# మీ జుట్టు నిగనిగలాడేలా మరియు పొడవుగా ఉండాలంటే ఈ కూరగాయలు మరియు పండ్లు తింటే సరిపోతుందని మీకు తెలుసా?




మందపాటి నల్లని పొడవాటి జుట్టు చాలా మంది మహిళల కల! చాలా మంది జుట్టు పెరగడానికి చాలా కాలం పాటు జుట్టును కత్తిరించరు. కానీ మీరు కోరుకుంటే, మీరు ఇకపై కనుగొనలేరు. పొడవాటి జుట్టు కావాలని కోరుకునే వారు చాలా మంది ఉన్నారు, కానీ చాలా ప్రయత్నించినా, వారు పొడవాటి జుట్టును పొందలేరు. ఆశించిన ఫలితాలు రాకుండా చాలా మంది నిరాశకు గురవుతున్నారు. జుట్టు మీ శరీరంలోని అత్యంత సున్నితమైన భాగాలలో ఒకటి. కఠినమైన వాతావరణంతో సంబంధం లేకుండా, అది శీతాకాలం లేదా వేసవి కాలం కావచ్చు, మీ జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది.ఆహారం నుండి జన్యుశాస్త్రం వరకు ఒత్తిడి మరియు పర్యావరణం వరకు, మందపాటి మరియు పొడవాటి జుట్టు కలిగి ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయి. ఖరీదైన షాంపూలు, కండిషనర్లు వాడుతూ జుట్టు పెంచుకుంటారు.అయితే అందరూ అలా చేయలేరుగా అలాంటి వారు ఏమి చేస్తారు? జుట్టు కోసం పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. బదులుగా, మీ రోజువారీ ఆహారంలో కొన్ని ఆహారాలను చేర్చండి. వెంట్రుకలతో పాటు శరీరానికి సరిపడా పోషకాలున్న ఆహారాలు అనేకం ఉన్నాయి. జుట్టు త్వరగా పెరగాలంటే ఎలాంటి ఆహారాలు తినాలో ఒకసారి చూడండిగుమ్మడికాయలో ఐరన్ మరియు బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. అలాగే ఇందులో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. జుట్టు పెరుగుదల మరియు బలానికి ఇది ముఖ్యమైన విటమిన్. గుమ్మడికాయలో విటమిన్ సి మరియు ఇ పుష్కలంగా ఉన్నాయి, ఇది మీ శరీర కణాలను దెబ్బతినకుండా రిపేర్ చేయడంలో సహాయపడుతుంది. మీ జుట్టు పొడవుగా పెరగడానికి ఈ కూరగాయలను మీ ఆహారంలో చేర్చుకోండి.ఆకుకూరల్లో విటమిన్ ఎ, సి, కెరోటిన్, ఫోలేట్ మరియు పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి కెరాటిన్‌ను అందిస్తాయి. ఇది మీ జుట్టు మూలాలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. అలాగే గ్రీన్ లీఫీ వెజిటేబుల్స్ లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది సెబమ్‌ను ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది మరియు స్కాల్ప్‌ను ఆరోగ్యంగా మరియు హైడ్రేట్‌గా ఉంచుతుంది.క్యారెట్‌లో విటమిన్ ఎ పుష్కలంగా ఉ ంటుంది, ఇది మీ జుట్టుకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. జుట్టుతో సహా శరీర కణాల పెరుగుదలకు విటమిన్ ఎ అవసరం. ఇది వేగంగా జుట్టు పెరుగుదలకు సరైన ఆహారంగా చేస్తుంది మరియు మీ జుట్టుకు మృదువైన ప్రకాశాన్ని ఇస్తుంది.తీపి బంగాళాదుంపలు బీటా-కెరోటిన్ యొక్క అద్భుతమైన మూలం, ఇది శరీర వినియోగం కోసం విటమిన్ ఎగా మార్చబడుతుంది. విటమిన్ ఎ జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.ఎరుపు మరియు పసుపు బెల్ పెప్పర్‌లలో మంచి మొత్తంలో యాంటీఆక్సిడెంట్-రిచ్ విటమిన్ సి ఉంటుంది, ఇది జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఈ విటమిన్ శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది మీ జుట్టు మూలాలను బలపరుస్తుంది మరియు ఆక్సీకరణ ఒత్తిడి నుండి జుట్టును రక్షిస్తుంది.అవోకాడో అత్యంత ఆరోగ్యకరమైన పండ్లలో ఒకటి. ఇది ఆరోగ్యకరమైన కొవ్వులు మరియు బయోటిన్‌తో నిండి ఉంటుంది. ఈ పండు అనేక హెయిర్ మాస్క్‌లలో ప్రముఖమైన పదార్థం. ఇందులో ఉండే విటమిన్ ఇ, జుట్టుకు పోషణనిచ్చే యాంటీ ఆక్సిడెంట్. అవోకాడో ఆక్సీకరణ ఒత్తిడి మరియు నష్టం నుండి శిరోజాలను రక్షిస్తుంది.అరటిపండులో సహజ నూనెలు, అనేక విటమిన్లు మరియు పొటాషియం పుష్కలంగా ఉ న్నాయి. ఇది జుట్టు రాలడం మరియు చివర్ల చివర్లకు చికిత్స చేయడంలో సహాయపడే ముఖ్యమైన పండు. అలాగే, ఇది బలమైన జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుంది. అరటిపండ్లు సహజంగా జుట్టు స్థితిస్థాపకతను పెంచుతాయి, అయితే మీ స్కాల్ప్ రంధ్రాలను అన్‌లాగ్ చేయడం మరియు చుండ్రు సమస్యలను నివారిస్తుంది.బొప్పాయిలో విటమిన్ ఎ, సి మరియు ఇ మరియు యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. మీ ఫోలికల్స్‌లో జుట్టు పెరుగుదలను ఉత్తేజపరిచేందుకు ఇవి చాలా అవసరం. బొప్పాయి దాని సహజ యాంటీ ఫంగల్ లక్షణాలతో చుండ్రును నిరోధిస్తుంది మరియు మీ జుట్టుకు లోతైన కండిషనింగ్‌ను అందిస్తుంది.నిమ్మ, నారింజ మరియు ద్రాక్షపండు వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. బెర్రీస్ విటమిన్ సి మరియు కొల్లాజెన్ కలిగి ఉంటాయి, ఇవి జుట్టును బలపరుస్తాయి. ఇటువంటి పండ్లు కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి మరియు తలలో రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ ద్వారా ఆక్సీకరణ నష్టం నుండి జుట్టు మూలాలను రక్షిస్తాయి.ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ కాస్మెటిక్ సైన్స్‌లో ప్రచురించబడిన ఒక నివేదిక ప్రకారం, జుట్టు రాలడానికి మరియు అనారోగ్యకరమైన స్కాల్ప్‌కు ప్రధాన కారణాలలో ఒకటి ఆక్సీకరణ ఒత్తిడి. అందువల్ల, మీ తల చర్మం మరియు జుట్టును ఆరోగ్యంగా మరియు సంతోషంగా ఉంచే విటమిన్ బి మరియు ప్రోయాంతోసైనిడిన్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే పండ్లను తీసుకోవాలి.

## మీ జుట్టు రాలిపోతుందా? పెరుగును మీ జుట్టుకు ఇలా వాడండి...

చాలా మంది రోజూ ఎదుర్కొనే ప్రధాన సమస్య జుట్టు రాలడం. ఇది చిన్న పిల్లల నుంచి స్త్రీ పురుషుల వరకు అందరిలోనూ ఉండే సాధారణ సమస్య. దీనికి అనేక సహజ నివారణలు ఉన్నాయి. జుట్టు రాలడంతోపాటు జుట్టు సమస్యలను పరిష్కరించడానికి మార్కెట్‌లో అనేక రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ, అవి పరిస్థితిని మరింత దిగజార్చవచ్చు మరియు మీకు దుష్ప్రభావాలను కలిగిస్తాయి. అందువల్ల, నిపుణులు ఎల్లప్పుడూ సహజ ఉత్పత్తులను ఉపయోగించమని సలహా ఇస్తారు. మీ జుట్టుకు అద్భుతాలు చేసే మీ జుట్టు సంరక్షణ దినచర్యలో పెరుగును చేర్చండి. జుట్టు రాలడాన్ని తగ్గించడంలో సహాయపడటానికి మీరు ఇంట్లోనే కొన్ని సహజమైన పెరుగు హెయిర్ మాస్క్‌లను తయారు చేసుకోవచ్చు. వాటిని ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకోండి. పెరుగు మరియు తేనె ముసుగు తేనె పోషకాలు మరియు తేమ యొక్క సహజ మూలం. ఇది జుట్టు రాలడాన్ని తగ్గించడానికి మరియు ఆరోగ్యకరమైన జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. మీ జుట్టు మరియు తలపై పోషణ మరియు బలోపేతం చేయడానికి పెరుగుతో తేనె హెయిర్ మాస్క్‌ను వర్తించండి. ఎలా చేయాలి: 1 టేబుల్ స్పూన్ తేనె తీసుకుని, అందులో 1 టేబుల్ స్పూన్ పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు అప్లై చేసి సుమారు 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో జుట్టును కడగాలి. ఇలా నిరంతరం చేయడం ద్వారా మీరు ఆశించిన ఫలితాలను పొందుతారు. పెరుగు మరియు కొబ్బరి నూనె హెయిర్ మాస్క్ కొబ్బరి నూనెలో అవసరమైన కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇది స్కాల్ప్‌కు పోషణ, జుట్టు రాలడాన్ని తగ్గించడం మరియు ఆరోగ్యకరమైన జుట్టును ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. పెరుగును కొబ్బరినూనెతో కలిపి రాసుకుంటే చుండ్రు తగ్గిపోయి శిరోజాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మీరు మీ జుట్టుకు మెరుపు మరియు మృదుత్వాన్ని జోడించడానికి సహజమైన కండీషనర్‌గా కూడా ఉపయోగించవచ్చు. ఎలా చేయాలి: 1 టేబుల్ స్పూన్ కొబ్బరి నూనెను తీసుకుని, 1 టేబుల్ స్పూన్ పెరుగుతో కలపండి. ఈ మిశ్రమాన్ని తలకు అప్లై చేసిన 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో మీ జుట్టును శుభ్రం చేసుకోండి. పెరుగు మరియు మెంతి గింజలు మెంతులు ప్రోటీన్ యొక్క సహజ మూలం. ఇది జుట్టు మూలాలను బలోపేతం చేయడానికి మరియు పోషణకు సహాయపడుతుంది, జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది మరియు ఆరోగ్యకరమైన జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. పెరుగు మరియు మెంతులు కలిపినప్పుడు, ఇది చుండ్రు, మురికి మరియు ఉత్పత్తులను తొలగించడానికి సహాయపడుతుంది. మెరుగైన పోషణ కోసం మెంతులు స్కాల్ప్‌లోకి లోతుగా చొచ్చుకుపోయేలా అనుమతించండి. అలాగే, ఇది జుట్టు మూలాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది మరియు జుట్టుకు మెరుపును ఇస్తుంది. ఎలా తయారుచేయాలి: 1 టేబుల్ స్పూన్ మెంతి గింజలను తీసుకుని, వాటిని మెత్తగా రుబ్బుకోవాలి. 1 టేబుల్ స్పూన్ పెరుగుతో పొడిని మిక్స్ చేసి, ఆ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. 15 నిమిషాల తరువాత, జుట్టును గోరువెచ్చని నీటితో కడగాలి. చివరి గమనిక సహజ పెరుగు హెయిర్ మాస్క్‌లను తయారు చేయడం మరియు ఉపయోగించడం సులభం. జుట్టు రాలడాన్ని తగ్గించడానికి మరియు ఆరోగ్యకరమైన జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి ఇవి గొప్ప మార్గం. ఈ హెయిర్ మాస్క్‌లను ఇంట్లోనే ప్రయత్నించండి మరియు తేడాను మీరే చూడండి.





## వర్షాకాలంలో వ్యాధులు రాకుండా ఉండాలంటే చికెన్ సూప్ తాగాలి..



మీరు చల్లని వాతావరణంలో సౌకర్యవంతంగా ఉండటానికి కష్టపడుతున్నట్లయితే, చికెన్ సూప్ త్వరిత పరిష్కారం. వర్షాకాలం వచ్చిందంటే అది ఫ్లూ మరియు ఇతర వ్యాధులను తెస్తుంది. చికెన్ సూప్ శ్వాసకోశ రుగ్మతలు, ఉబ్బసం మరియు తల నొప్పి వంటి ఇతర వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. ఇది ముక్కులోని వ్యాధికారక క్రిములను వేగంగా బయటకు పంపుతుంది. అంతేకాకుండా, వర్షాల సమయంలో మీ సోఫాలో విశ్రాంతి తీసుకునేటప్పుడు వేడి వేడి గిన్నెలో ఉండే చికెన్ సూప్ మీకు కావలసి ఉంటుంది. మారుతున్న కాలంలో రోగనిరోధక శక్తి మందగిస్తుంది. దీనివల్ల ప్రజలు మరింత అనారోగ్యానికి గురవుతున్నారు. కాబట్టి ఈ వర్షాకాలం, ఆరోగ్యంగా ఉండండి మరియు ఎక్కువ జబ్బు పడకండి, దాని కోసం, వేడి సూప్ తాగండి. వర్షాకాలంలో, జలుబు, దగ్గు, జలుబు మరియు కడుపు నొప్పి వంటి వ్యాధుల ప్రమాదం కూడా పెరుగుతుంది. వర్షాకాలంలో సూప్‌లు తాగడం జీర్ణక్రియకు సహాయపడుతుందని డైటీషియన్ నిపుణులు చెప్తున్నారు. దీనితో పాటు శరీరం కూడా హైడ్రేటెడ్‌గా ఉంటుంది. వర్షాకాలంలో సూప్ తాగడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో నేటి కథనంలో పోషకాహార నిపుణుడి ద్వారా తెలుసుకుందాం. వర్షాకాలంలో సూప్ ప్రయోజనాలు 1. సులభంగా జీర్ణం అవుతుంది సూప్ సులభంగా జీర్ణమవుతుంది. వర్షాకాలంలో, చాలా మంది ప్రజలు అజీర్ణం, అజీర్ణం, గ్యాస్ మరియు మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. సూప్‌లు సులభంగా జీర్ణమవుతాయి కాబట్టి జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. సూప్ తాగడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం సమస్య ఉండదు. వర్షాకాలంలో పాలకూర, కొత్తిమీర పులుసు తాగితే జీర్ణక్రియకు ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణుడు శైలి తోమర్ చెప్పారు. 2. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోండి వర్షాకాలం అంటుకునే కాలం. శరీరం విపరీతంగా చెమట పడుతుంది. ఈ కారణంగా, శరీరం నుండి నీరు విడుదల అవుతుంది మరియు శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది. మీరు ఈ సీజన్‌లో సూప్ తాగితే, శరీరంలో నీటి పరిమాణం బాగా ఉ ంటుంది. బాటిల్ పొట్లకాయ సూప్ కూడా ఆర్ద్రీకరణకు చాలా మంచిదని భావిస్తారు. 3. బరువు నియంత్రణ సూప్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. చాలా సూప్‌లను కూరగాయలతో తయారు చేస్తారు, కాబట్టి వాటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. పీచు వర్షాకాలంలో శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. మరియు బరువును కూడా నియంత్రిస్తుంది. సూప్ తాగడం వల్ల జీర్ణక్రియ మరియు కొలెస్ట్రాల్ స్థాయిలు బాగుంటాయి. రక్తంలో చక్కెరను నియంత్రించడానికి ఫైబర్ రిచ్ సూప్ మంచి ఎంపిక. రోజుకు 25 గ్రాముల సూప్ అవసరమని పోషకాహార నిపుణుడు శైలి తోమర్ చెప్పారు. 1 గిన్నె సూప్ నుండి మనకు 5-10 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. 4. రోగనిరోధక శక్తి బూస్టర్ కరోనా సమయంలో మన రోగ నిరోధక శక్తి పటిష్టంగా ఉండడం చాలా అవసరం. మనకు తక్కువ జబ్బు వస్తుంది. రెండో రుతుపవనాలు రాగానే మరెన్నో రోగాలు వస్తాయి. ఈ వ్యాధులు రాకుండా ఉండాలంటే మాన్ సూన్ సూప్ తాగడం ఆరోగ్యకరం. వెజిటబుల్ సూప్‌లో విటమిన్లు ం, ః, అ, ఇ, ఐ మొదలైనవి ఉంటాయి మరియు ఇనుము, కాల్షియం, జింక్, ఫాస్పరస్, సెలీనియం మరియు మెగ్నీషియం మొదలైన ఖనిజాలు ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. బీట్‌రూట్ సూప్ రక్త ప్రసరణకు సహాయపడుతుంది. అదనంగా, బీట్‌రూట్ రసం కూడా రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. పసుపును సూప్‌లో చేర్చడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. 5. కాలానుగుణ జలుబు మరియు ఫ్లూ తొలగించండి రుతుపవనాలలో వాతావరణం మారుతుంది. కొన్నిసార్లు వేడి మరియు కొన్నిసార్లు చల్లని గాలులు. అటువంటి పరిస్థితిలో, వాతావరణం పొడిగా మరియు తేమగా ఉంటుంది. తేమ వల్ల బ్యాక్టీరియా, వైరస్ ల వల్ల వచ్చే వ్యాధులు వర్షాకాలంలో పెరుగుతాయి. ఈ బ్యాక్టీరియా లేదా వైరస్ కారణంగా, జలుబు, దగ్గు లేదా గొంతు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. వేడి సూప్‌లో పసుపు లేదా నల్ల మిరియాలు జోడించడం ద్వారా సీజనల్ ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. 6. జుట్టు రాలడాన్ని ఆపుతుంది వర్షాకాలంలో జుట్టు రాలడం అనేది ఒక సాధారణ సమస్య. మనమందరం ఈ సమస్యను ఎదుర్కొంటున్నాము. మహిళల్లో జుట్టు రాలడం ఎక్కువగా ఉంటుంది. వర్షాకాలంలో అధిక చెమట మరియు అధిక తేమ కారణంగా జుట్టు రాలడం జరుగుతుంది. ఈ సీజన్‌లో మూంగ్ పప్పు, మసూర్ పప్పు లేదా నల్ల శనగ సూప్ వంటి పప్పు పులుసు తాగడం వల్ల శరీరానికి మంచి ప్రొటీన్ అందుతుంది. ఇది జుట్టు రాలడం సమస్యను దూరం చేస్తుంది మరియు జుట్టు పెరుగుదలను మెరుగుపరుస్తుంది. 7. చర్మ సమస్యలను దూరం చేస్తుంది వర్షాకాలంలో మొటిమలు, మొటిమలు, పగుళ్లు మొదలైన చర్మ సమస్యలు పెరగడం ప్రారంభిస్తాయి. ఈ సీజన్‌లో చెమట ఎక్కువగా ఉండటం మరియు వాతావరణంలో తేమ పెరగడం వల్ల ఇది జరుగుతుంది. ముఖంపై నూనె స్రావం పెరుగుతుంది, ఇది రంధ్రాలను మూసుకుపోతుంది, అయితే సూప్ తాగడం వల్ల చర్మానికి అవసరమైన అన్ని పోషకాలు అందుతాయి. వీటితో పాటు వీటిని తాగడం వల్ల శరీరంలో రక్తప్రసరణ సజావుగా సాగుతుంది. సూప్‌లో ఫైబర్ ఉంటుంది, ఇది శరీరం నుండి విషాన్ని బయటకు పంపుతుంది. దీన్ని తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, మెరిసిపోతుంది. 8. ఆకలిని పెంచుతుంది వర్షాకాలంలో చాలా మంది ప్రజలు ఆకలి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పిల్లలకు ఆకలి తక్కువగా అనిపిస్తుంది. కొన్నిసార్లు మీకు ఆకలి తక్కువగా అనిపిస్తుంది మరియు కొన్నిసార్లు మీకు ఆకలిగా అనిపించదు. భోజనం లేదా రాత్రి భోజనానికి ముందు సూప్ తాగడం వల్ల జీర్ణ ఎంజైమ్‌లు విడుదలవుతాయి మరియు ఆకలిని మెరుగుపరుస్తుంది. 9. శక్తి యొక్క మూలం వర్షాకాలంలో మనకు బద్ధకం మరియు అలసటగా అనిపిస్తుంది. కానీ సూప్ తాగడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది మరియు శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుంది.


## ఎంతకీ పెళ్లి కావడం లేదా? గోమాతకు వీటిని తినిపిస్తే త్వరలోనే పెళ్లి పీటలెక్కుతారు




పెళ్లి అనే సంబంధంలోకి ప్రతి ఒక్కరూ కొద్దిగా ముందో వెనకో అడుగుపెడతారు. మేం అసలు పెళ్లే చేసుకోము అనే వారి గురించి వదిలేస్తే.. ప్రతి ఒక్కరి జీవితంలో అతి పెద్దదైన ఈ పండగ చుట్టూ చాలా మందికి చాలా ఆశలు, కోరికలు ఉంటాయి. కానీ కొంత మందికి ఈ పెళ్లి విషయంలో చాలా సమస్యలు ఎదుర్కొంటుంటారు. ఒకవైపు వయస్సు మీద పడుతూ ఉంటుంది. అయినా ఒక్క సంబంధం కూడా సెట్ అవదు. 30ల్లోకి వచ్చినా పెళ్లి సంబంధం ఖాయం కాక తెగ ఇబ్బంది పడిపోతుంటారు. బట్ట, పొట్ట ఉన్న వాళ్ల పరిస్థితి ఇక చెప్పక్కర్లేదు. ఎప్పుడు జరగాల్సిన కార్యం అప్పుడు జరిగితేనే బాగుంటుంది. ఆలస్యం అయ్యే కొద్దీ ఇతర సమస్యలు వస్తుంటాయి. కొందరికైతే చాలా సమస్యలు చూస్తూ ఉంటారు, కానీ ఒక్కటీ ఖాయం అవదు. ఇష్టాయిష్టాల కారణంగా సంబంధం వద్దనుకోవడం ఒకటైతే.. జ్యోతిష సమస్యల కారణంగా సంబంధాలు ఖాయం కాకపోవడం కూడా ఒకటి. పెళ్లి ఖాయం కాక ఇబ్బంది పడేవారు గోమాతకు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినిపిస్తే త్వరలోనే పెళ్లి ఖాయం అవుతుందని అంటున్నాయి శాస్త్రాలు. పవిత్రతకు, శుభానికి చిహ్నమైన గోమాతకు.. ఆహారం పెట్టడం వల్ల విశేష ఫలితాలు ఉంటాయని, అందులో పెళ్లి సంబంధం ఖాయం కావడం కూడా ఒకటని అంటున్నారు. గోమాత విశిష్టత భారతీయులు ఆవును గోమాత అని పిలుస్తారు. గోవు పవిత్రతకు, శుభానికి చిహ్నం. ఆవుల పాలతో పాటు మూత్రం, పేడ కూడా ఎంతో పవిత్రమైనవిగా పరిగణిస్తారు. ఉదయం వేళ ఆవును కళ్లారా చూసి దినచర్యను ప్రారంభించడం ఎంతో శుభశకునంగా భావిస్తుంటారు. గోవు సకల దేవతా స్వరూపం, సమస్త దేవతలంతా గోవులోనే కొలువై ఉంటారని అంటారు. అలాంటి గోమాతకు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినిపించడం వల్ల పెళ్లి ఖాయం అవుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. గోమాతకు వీటిని తినిపిస్తే పెళ్లి సెట్ అవుతుంది గోమాతకు కొన్ని పదార్థాలు తినిపించడం అనేక ప్రయోజనాలు ఉంటాయి. అలాగే పెళ్లి కాక ఇబ్బంది పడేవారు, సంబంధం ఖాయమై ఆఖరి నిమిషంలో క్యాన్సిల్ అయ్యే వారు, ఇతర కారణాల వల్ల ఏ సంబంధం కూడా సెట్ కానివారు గోమాతకు టమాటాలు తినిపించాలట. గోవుకు టమాటాలు తినిపించడం వల్ల మంచి ఫలితం ఉంటుందట. ఎర్రటి, చక్కగా పండిన టమాటాలు తినిపిస్తే.. చాలా త్వరలోనే సంబంధం ఖాయం అవుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. కోరుకున్న గుణాలు కలిగిన వ్యక్తితో వివాహం జరిగే అవకాశాలు పెరుగుతాయి. బయట తిరిగే ఆవులకైనా, లేదా గోశాలలో ఉన్న గోవులకైనా టమాటాలు తినిపించవచ్చు. టమాటాలతో పాటు వాటిని వాడి తయారు చేసే ఇతర పదార్థాలు గోవులతో తినిపించినా అద్భుతమైన ప్రయోజనాలు కనిపిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా ఈ వ్యాసాన్ని రాయడం జరిగింది. కచ్చితత్వానికి, విశ్వసనీయతకు ఎలాంటి హామీ ఇవ్వడం లేదు. ఈ వ్యాసానికి సంబంధించిన ఏ విషయాన్నీ నిర్ధారించడంలేదు. ఈ వ్యాసం ఉద్దేశం సమాచారం అందించడం మాత్రమే. ఏదైనా పాటించే ముందు సంబంధిత నిపుణుల సలహా తీసుకోగలరు.

## శివునికి బిల్వపత్ర పత్రాలను ఎందుకు సమర్పిస్తారు? సమర్పించేటప్పుడు ఈ నియమాలను తెలుసుకోండి

శ్రావణ మాసం శివారాధనకు అంకితమైన మాసం, శివపూజలో బిల్వపత్ర ఆకులకు చాలా ప్రాముఖ్యత ఉంది, శివపూజలో ఏమీ సమర్పించకపోయినా, బిల్వపత్రమే సమర్పించాలి, లేకుంటే మన పూజలతో శివుడు సంతృప్తి చెందడు అని అంటారు.శివపూజలో తప్పనిసరిగా ఉండవలసిన ముఖ్యమైన అంశం బిల్వ పత్రే. బిల్వపత్రే లేకుండా శివుని ఆరాధన పూర్తి కాదు. అందుచేత శివపూజలో బిల్వపత్రే చాలా ముఖ్యమైనది. అలాగే శివపూజలో దీనిని ఉపయోగించడం వెనుక ఒక అర్థం ఉంది. శివపూజ కోసం బిల్వ పాత్రను ఎలా ఎంచుకోవాలి? శివపూజకు బిల్వపత్రే ఆకును ఎంపిక చేసుకునేటప్పుడు అందులో తెలుపు-తెలుపు ఉ ండకూడదు. ఆకుపై కీటకం కుంటి ఉన్నప్పుడు అటువంటి ఆకులను తీయవద్దు. అలాగే 3 ఆకులతో కూడిన కొమ్మను తీసి శివునికి నైవేద్యంగా పెట్టాలి, అందులో ఒక ఆకు పడిపోయినా దానిని శివపూజలో ఉపయోగించకూడదు. అలాగే పూజకు ఉ పయోగించే ఆకును చింపివేయకూడదు.శివుడికి మూడు బిల్వ పత్రాలను సమర్పించడం దేనికి సంకేతం? బిల్వే పాత్ర యొక్క మూడు ఆకులు త్రికాల మరియు హిందూ దేవుళ్ళైన బ్రహ్మ, విష్ణు మరియు శివుని త్రిమూర్తులను సూచిస్తాయి. ఈ ఆకు శివుడు, రుద్రమూర్తిని శాంతపరుస్తుందని కూడా చెబుతారు. ప్రశాంతమైన శివుడు మనలను అనుగ్రహిస్తాడని, తద్వారా మన కష్టాలు తొలగిపోయి, మన సంకల్పాలు నెరవేరుతాయని నమ్ముతారు. 3వ కన్ను బిల్వ పత్రం శివునికి మూడు బిల్వ పత్రాలను సమర్పించడం శివుని 3వ కన్ను ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. శివుని మూడవ కన్ను గురించి అనేక పురాణ కథలు ఉన్నాయి. దేవతలు మరియు రాక్షసుల మధ్య యుద్ధం జరుగుతుంది మరియు తారకాసురుడు విశ్వాన్ని నాశనం చేయగల ఆయుధాన్ని సృష్టిస్తాడు. అప్పుడు అతను శివుని 51 శక్తి పీఠాలను స్థాపించాడు మరియు భూమిని మరియు దేవతలను రక్షించడానికి ముందుకు సాగాడు. శివుని మూడవ కన్నుగా చెప్పబడే ఆ ఘోరమైన ఆయుధాన్ని శివుడు తన శరీరంలోకి గ్రహిస్తాడు.




# బాలయ్య పాన్ ఇండియా ప్రాజెక్ట్ సంగతేంటి?





టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ వరుస సినిమాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఆరు పదుల వయసులో కూడా ఒక్క సినిమా తర్వాత మరో మూవీతో సందడి చేస్తున్నారు. నటించాలనే కోరిక ఉన్నప్పుడు ఏజ్ తో ఎలాంటి సంబంధం లేదని ప్రూవ్ చేసిన వారిలో బాలయ్య కూడా ఒకరనే చెప్పాలి. అఖండ మూవీతో హిట్ ట్రాక్ ఎక్కిన బాలయ్య.. ఆ తర్వాత వీర సింహ రెడ్డి, భగవంత్ కేసరితో హ్యాట్రిక్ హిట్స్ అందుకున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి డాకు మహారాజ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇప్పుడు అఖండ-2లో యాక్ట్ చేస్తున్నారు. ఇప్పటికే ఆ సినిమా షూటింగ్ కంప్లీట్ అయినట్లు తెలుస్తోంది. బ్లాక్ బస్టర్ హిట్ మూవీకి సీక్వెల్ తో పాటు బోయపాటి శ్రీనుతో నాలుగోసారి బాలయ్య వర్క్ చేస్తుండడంతో ఆడియన్స్, అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కచ్చితంగా సినిమా హిట్ అవుతుందని అంతా అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు మేకర్స్ రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ కూడా అదే హైప్ క్రియేట్ చేస్తోంది. అఖండ-2 మూవీతో బాలయ్య పాన్ ఇండియా మార్కెట్ లో ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో అఖండ సీక్వెల్ ను సెప్టెంబర్ 25న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. నార్త్ లో బాలయ్యకు పెరుగుతున్న ప్రజాదరణ వల్ల పాన్ ఇండియా రేంజ్ లో అలరిస్తుందనే హోప్స్ తో ఉన్నారు. కానీ రిలీజ్ డేట్ పైనే అనుమానపడుతున్నారు. ఎందుకంటే రిలీజ్ కు మరో 40 రోజులే ఉన్నా మేకర్స్ ఒక్క సాంగ్ కూడా విడుదల చేయలేదు. పోస్ట్ పోన్ అంటూ రూమర్స్ వస్తున్నా స్పందించడం లేదు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పెద్ద ఎత్తున పెండింగ్ ఉన్నట్లు ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. యాక్షన్ సీక్వెన్స్ ల్లో విజువల్ ఎఫెక్ట్స్ కీలకం. అందుకే బోయపాటి శ్రీను వ్యక్తిగతంగా యాక్షన్ డిజైన్ ను పర్యవేక్షిస్తున్నారని టాక్. ప్రతి సన్నివేశానికి వివరణాత్మక శ్రద్ధ అవసరమనే చెప్పాలి. దీంతో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కు టైమ్ పట్టేలా కనిపిస్తుంది. అదే నిజమైతే రిలీజ్ డేట్ లో మార్పు తప్పదు. మరి బాలయ్య పాన్ ఇండియా ప్రాజెక్ట్ విషయంలో మేకర్స్ ఏం చేస్తారో.. ఎప్పుడు రిలీజ్ చేస్తారో వేచి చూడాలి.



# ఒక్క హిట్ తోనే హీరోయిన్ ఓరియేంటెడ్!

# జన నాయగన్.. దళపతి విజయ్ ఏం చేస్తాడో మరి?




కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి ఇప్పుడు జన నాయగన్ మూవీతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఓవైపు పూర్తి స్థాయి రాజకీయాల్లోకి అడుగు పెట్టిన ఆయన, ఇప్పుడు జన నాయగన్ ను పూర్తి చేస్తున్నారు. అదే ఆయన చివరి సినిమా అని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతున్నా.. విజయ్ మాత్రం ఆ విషయంపై రెస్పాండ్ అవ్వలేదు. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా హెచ్. వినోత్ దర్శకత్వం వహిస్తున్న జన నాయగన్ లో పూజ హెగ్డే, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మమితా బైజు, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రకాష్ రాజ్, నరైన్, ప్రియమణి సహా పలువురు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ క్రేజీ అండ్ రాక్ మ్యూజిక్ ను అందిస్తున్నారు. ం వచ్చే ఏడాది సంక్రాంతికి కానుకగా సినిమా రానుండగా.. ఇప్పుడు ఆ మూవీ వసూళ్లపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రీసెంట్ గా సూపర్ స్టార్ రజినీకాంత్ కూలీ మూవీ.. బాక్సాఫీస్ వద్ద అనుకున్నంతగా రాణించకపోవడంతో కోలీవుడ్ లో అత్యధికంగా జనాలను ఆకర్షించేది ఎవరనే దానిపై చర్చ మొదలైంది. ముఖ్యంగా మౌత్ టాక్ తోనే భారీ వసూళ్లు సాధించగలనని దళపతి విజయ్ ఇప్పటికే పలుమార్లు ప్రూవ్ చేసుకున్నారు. వారిసు, గోట్ వంటి చిత్రాలతో పెద్ద ఎత్తున కలెక్షన్స్ సాధించి నిరూపించారు. స్టోరీ, జోనర్ తో సంబంధం లేకుండా.. విజయ్ ఎల్లప్పుడూ కోలీవుడ్ ఆడియన్స్ ను థియేటర్స్ కు రప్పిస్తారని చెప్పాలి.ఇప్పుడు మళ్లీ జన నాయగన్ మూవీతో దాన్ని రిపీట్ చేస్తారో లేదోనని అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. గ్రాండ్ గా ఓపెనింగ్స్ కు వివిధ అంశాలు దోహదం చేస్తాయని, మిగతాది మౌత్ టాక్ పైనే ఆధారపడి ఉంటుందని చెప్పాలి. అయితే జన నాయగన్ మూవీపై ఇప్పటికే ఆడియన్స్, సినీ ప్రియుల్లో మంచి అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. రీసెంట్ గా మేకర్స్ ఫస్ట్ రోర్ పేరుతో వీడియో గ్లింప్స్ రిలీజ్ చేయగా.. సూపర్ రెస్పాన్స్ వచ్చింది. పోలీస్ డ్రెస్ లో అల్లర్లు చెలరేగుతున్న వీధిలో నడుస్తున్నట్లు విజయ్ చూపించారు. అయితే ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సినిమాలు మనుగడ సాగించడానికి స్టార్ పవర్ తోడ్పడే రోజులు పోయాయి. కంటెంట్ ఉంటేనే క్లిక్ అవుతోంది. మరి ఇప్పుడు విజయ్ జన నాయగన్ మూవీతో ఏం చేస్తారో వేచి చూడాలి.



నిధి అగర్వాల్ కెరీర్ లో ఇప్పటి వరకూ తెలుగులో నటించిన సినిమాలు ఐదు. వాటిలో హిట్ అయిన చిత్రాలెన్ని? అంటే ఒకటి మాత్రమే. అదే 'ఇస్మార్ట్ శంకర్'. ఈ సినిమా మినహా అన్ని చిత్రాలు అంచనాలు అందుకోవడంలో విఫలమైనవే. అవన్నీ స్టార్ హీరోలతో నటించిన సినిమాలే అయినా? వైఫల్యాలు నిధి స్టార్ డమ్ ని తీసుకు రాలేకపోయాయి. ఇటీవలే భారీ అంచనాల మధ్య పాన్ ఇండియా లో రిలీజ్ అయిన 'హరిహరవీరమల్లు' తిరుగులేని విజయం సాధిస్తుందనుకున్నారంతా? కానీ ఆ సినిమా ఫలితం తీవ్ర నిరాశనే మిగిల్చింది. ంశ్రీబనీ ఖీవజీట – ఈ వారం కొత్త రిలీజులివే! కొత్త డైరెక్టర్ తో ప్రయత్నం: ప్రస్తుతం నిధి అగర్వాల్ చేతిలో ఉన్న పెద్ద ప్రాజెక్ట్ 'రాజాసాబ్' మాత్రమే. అమ్మడు ఆశలన్నీ ఈ చిత్రంపైనే పెట్టుకుంది. జరిగిందేదో? జరిగిపోయింది ప్రభాస్ సినిమాతోనైనా బూస్టింగ్ దక్కుతుందని చాలా ఆశలతో ఎదురు చూస్తోంది. ఈ చిత్రం డిసెంబర్ లో రిలీజ్ కానుంది. సరిగ్గా ఇదే సమయంలో నిధజ అగర్వాల్ ఓ లేడీ ఓరియేంటెడ్ చిత్రం ప్రకటనతో రావడం విశేషం. నిఖిల్ కార్తీక్ అనే కొత్తకుర్రాడు ఈచిత్రాన్ని తెరకెక్కించనున్నారు. పుప్పాల అప్పలరాజు నిర్మిస్తున్నారు. ఇదొక హారర్ థ్రిల్లర్ సబ్జెక్ట్ .అవకాశమే గొప్ప విషయం: బడ్జెట్ లెక్కలు బయటకు రాలేదు గానీ నిధితో లేడీ ఓరియేంటెడ్ ప్రకటనతోనే ఈ వార్త సోషల్ మీడియాలో దావానాలా వ్యాపిస్తోంది. వరుస ప్లాప్ ల్లో ఉన్నా నిధితో లేడీ ఓరియేంటెడ్ చిత్రమేంటనే విమర్శ వ్యక్త మవుతోంది. ఆ సంగతి పక్కన బెడితే నిధి అగర్వాల్ ఇలాంటి సమయంలో అవకాశం రావడం గొప్ప విషయం. సోలో నాయికగా సత్తా చాటలేకపోయినా అమెను నమ్మి లేడీ ఓరియేంటెడ్ చిత్రంలో అవకాశం దక్కింది. ంటలవతీబితిబవఎవనిబి వాళ్ల సరసన నిధి అగర్వాల్: ఇలాంటి సినిమాలో పూర్తి స్థాయి నటనకు ఆస్కారం ఉంటుంది. హీరోతో సినిమా అంటే పాట, రొమాంటిక్ సన్నివేశాలకే పరిమితం. కానీ ఉమెన్ సెంట్రిక్ చిత్రమంటే కథ అంతా ఆమె పాత్ర చుట్టూనే తిరుగుతుంది కాబట్టి తనలో అసలైన నటిని బయటకు తీయొచ్చు. మరి ఈ అవకాశాన్ని నిధి అగర్వాల్ ఎంత వరకూ సద్వినియోగం చేసుకుంటుందో. ఇప్పటికే ఈ తరహా సినిమాలు చేయడంలో అనుష్క శెట్టి ఆరితేరింది. కీర్తి సురేష్, రష్మికా మందన్నా లాంటి వాళ్లు ప్రయత్నిస్తున్నారు. వాళ్ల సరసన నిధి కూడా చేరుతున్నట్లే.

# 'ఖైదీ -2' నిర్మాణ సంస్థ లో మార్పు దేనికి?



కార్తీ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మించిన 'ఖైదీ' ఎంత పెద్ద హిట్ అయిందో తెలిసిందే. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఈ విజయం కారణంగా ఎల్ సీయూ క్రియేట్ అయింది. ఇదే యూనివర్స్ నుంచి ఐదారేళ్ల పాటు సినిమాలు తీయడానికి లోకేష్ ఫిక్స్ అయి ముందుకెళ్తున్నాడు. ప్రస్తుతం ఖైదీ 2 ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి.అక్టోబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టడానికి రెడీ అవుతున్నారు. అయితే 'ఖైదీ 2' చిత్రాన్ని నిర్మిస్తోంది మాత్రం కేవీఎన్ ప్రొడక్షన్ హౌస్.అంటే కన్నడ పరిశ్రమకు చెందిన నిర్మాణ సంస్థ. ఇప్పుడీ సంస్థ 'ఖైదీ 2' నిర్మాతగా మారడం అన్నది ఆసక్తికరంగా మారింది. సాధారణంగా హిట్ సినిమా సీక్వెల్ని ఏ నిర్మాణ సంస్థ వదులుకోదు. సీక్వెల్ కాబట్టి రైట్స్ ఆ సంస్థకే చెందకపోయినా? చాలా వరకూ హిట్ డైరెక్టర్ ని వదులుకోవాలని ఏ నిర్మాణ సంస్థ చూడదు. కానీ 'ఖైదీ 2' ని కేవీఎన్ సంస్థ నిర్మించడంతో? డ్రీమ్ వారియర్ సంస్థ కావాలనే తప్పుకుందా? లేక లోకేష్ తప్పించాడా? అన్నది చర్చనీయాంశంగా మారింది. అయితే ఖైదీ తర్వాత లోకేష్ తెరకెక్కిం చిన 'విక్రమ్' ని రాజ్ కమల్ ఫిల్మ్స్ పై కమల్ హాసన్ నిర్మించారు. రెండూ వేర్వేరు సంస్థల్లోనే: అదే యూనివర్స్ నుంచి రిలీజ్ మరో చిత్రం 'లియో' ని సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ నిర్మించింది. ఇలా ఎల్ సీయు నుంచి రిలీజ్ అయిన సినిమాలన్నీ వేర్వేరు సంస్థలో నిర్మాణమైనవే. లోకేష్ ఏ సంస్థ ను రిపీట్ చేయలేదు. ఈ నేపథ్యంలో డ్రీమ్ వారియర్ కూడా అలా బయటకు వెళ్లిన సంస్థగానే కొంత మంది భావిస్తున్నారు. యూనివర్స్ తో సంబంధం లేకుండా లోకేష్ కెరీర్ ఆరంభంలో తెరకెక్కించిన 'మా నగరం', రీసెంట్ రిలీజ్ 'కూలీ ' కూడా వేర్వేరు సంస్థల్లో నిర్మాణమైనవే.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**